ఓరుగల్లుపై బీజేపీ గురి



- మోదీ చరిష్మా... అరూరి ఇమేజ్‌పై కమలదళంలో ఆశలు
- 40ఏళ్లకు గెలుపుపై ధీమాతో కార్యక్షేత్రంలోకి శ్రేణులు
- ఇంటింటి ప్రచారం, కార్నర్ మీటింగులపై దృష్టి
- అటు చేరికలు.. ఇటు పోల్ మెనేజ్‌మెంట్‌పై నజర్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

వరంగల్ సీటుపై బీజేపీ గురిపెట్టింది. 40ఏళ్ల తర్వాత వరంగల్‌లో ఆ పార్టీకి అనుకూల పవనాలు వీస్తున్నట్టు కమలనాథులు అంచనా వేస్తున్నారు. 1984లో చందుపట్ల జంగారెడ్డి బీజేపీ అభ్యర్థిగా విజయం సాధించగా.. నాటిన ఉంచి మళ్లీ బీజేపీకి ఓరుగల్లు ఓటర్లు అవకాశం ఇవ్వలేదు. ఈసారి ప్రధాని మోదీ చరిష్మాకు తోడు బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ ఇమేజ్ తమ పార్టీ గెలుపునకు దోహదం చేస్తుందనే అంచనాల్లో నేతలున్నారు. దీంతో గెలుపు వ్యూహాలకు నేతలు మరింత పదను పడుతున్నారు. ఇంటింటి ప్రచారంతో ఓటర్లను వీలైనన్ని ఎక్కువసార్లు కలవటంతో పాటు కార్నర్ మీటింగులు, బూత్‌స్థాయి ప్రచారానికి ప్రాధాన్యమిచ్చేలా బీజేపీ అధిష్ఠానం ప్రణాళిక రూపొందిస్తోంది. వలసలను ప్రోత్సాహిస్తూనే.. పోల్‌మేనేజ్‌మెంట్‌పై బీజేపీ ఫోకస్ చేస్తోంది.

బీజేపీలో 40 ఏళ్లకు గెలుపుపై ఆశలు

ఎప్పుడో 40 ఏళ్ల క్రితం గెలిచిన వరంగల్ స్థానంపై బీజేపీలో మళ్లీ ఆశలు చిగురించాయి. 1984లో వరంగల్ (హనుమకొండ) స్థానంలో టీడీపీ మద్దతుతో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన చందపట్ల జంగారెడ్డికి 2,63,762 ఓట్లు (51శాతం) పోలవ్వగా, అప్పటి కేంద్ర మంత్రిగా ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి పీవీ.నర్సింహరావుకు 2,09,564 ఓట్లు (40.50శాతం) మాత్రమే పోలయ్యాయి. దీంతో పీవీ. నర్సింహరావుపై చందుపట్ల జంగారెడ్డి 54,198ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. నాడు దేశంలో బీజేపీ గెలిచిన రెండు ఎంపీ సీట్లలో వరంగల్ ఒకటి. ఆ తరువాత జరిగిన ఏ ఎంపీ ఎన్నికల్లోనూ బీజేపీ విజయం సాధించలేదు. చలా సార్లు బీజేపీకి డిపాజిట్ కూడా దక్కలేదు. 2014 ఎంపీ ఎన్నికల్లో రాగమళ్ల పరమేశ్వర్‌కు 1,87,139ఓట్లు (15.93శాతం), 2015లో జరిగిన ఉపఎన్నికల్లో పగిడిపాటి దేవయ్యకు 1,29,868 (12.57శాతం) ఓట్లు పోలయ్యాయి. 2019 ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి చింత సాంబమూర్తికి కేవలం 83,777ఓట్లు (7.89శాతం) మాత్రమే పోలయ్యాయి. గత పదేళ్లలో ప్రతీ ఎన్నికల్లో బీజేపీ ఓటు బ్యాంకు దిగజారుతూ వచ్చింది. అయితే ఈసారి అనూహ్యంగా బీజేపీ పుంజుకుంటున్నట్టు ప్రచారం జరుగుతుండటం, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడి పోవటంతో కీలక నేతలు ఆ పార్టీని వీడుతున్నారు. దీంతో మే 13న జరిగే లోక్‌సభ ఎన్నిక ల్లో కాంగ్రెస్‌కు దీటుగా ఎదిగేందుకు కాషాయ పార్టీ వ్యూహాలు రచించింది. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు,మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను బీజేపీలో చేర్చుకుని టికెట్ ఇచ్చింది. పార్టీలో కీలక నేతల మధ్య సమన్వయం చేసి ఎన్నికల బాధ్యతలను అప్పగించింది. 40ఏళ్ల తరువాత పరిస్థితులు తమకు అనుకూలంగా ఉండటంతో ఆ పరిస్థితులను వినియోగించుకోవాలన్న లెక్కల్లో బీజేపీ నేతలున్నారు.

ఓటర్లే లక్ష్యంగా ముున్ముందుకు..

ఈ పార్లమెంట్ ఎన్నికల్లో విజయం కోసం ఉవ్విళ్లూరుతున్న బీజేపీ ఓటర్లే లక్ష్యంగా ఎత్తులు వేస్తోంది. మే 13న జరిగే ఎన్నికల లోపు ప్రతీ ఓటరును కలిసే వ్యూహరచన చేస్తోంది. ప్రధానంగా బూత్‌స్థాయి కమిటీలపై దృష్టి పెట్టింది. బూత్ కమిటీ సభ్యులు ఎన్నికల నాటికి ప్రతీ ఇంటికి కనీసం మూడుసార్లు వెళ్లి ఓటరును కలిసి బీజేపీ అభ్యర్థికి ఓటడిగేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఇప్పటికే ఈ నెల 15, 16, 17 తేదీల్లో తొలివిడతగా బూత్ స్థాయిలో ఇంటింటికి వెళ్లి బీజేపీకి మద్దతు ఇవ్వాలని కోరిన శ్రేణులు.. రెండో విడతగా ఈనెల 28,29,30 తేదీలు, మూడో విడతగా మే 9,10,11 తేదీల్లో ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించేలా వ్యూహరచన చేస్తున్నారు. బూత్‌స్థాయి ప్రచారంతో పాటు కార్నర్ మీటింగ్‌లకు కూడా ప్రాధాన్యమిస్తున్నారు. మే మొదటి వారంలో సాధ్యమైనంత వరకు ఎక్కువగా బీజేపీ అభ్యర్థి రమేష్‌తో కలిసి కార్నర్ మీటింగ్‌లు నిర్వహించేలా అధిష్ఠానం ప్రణాళిక రూపొందిస్తోంది. పార్లమెంట్ పరిధిలో ఒకటి రెండు భారీ బహిరంగ సభలను నిర్వహించేలా అది కూడా ప్రధాని మోదీ లేదా అమిత్‌షాతో ఒక సభ, బీజేపీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై లేదంటే జేపీ నడ్డాలలో ఒకరితో మరో మీటింగ్ ఏర్పాటు చేయాలని భావిస్తోంది. గ్రామస్థాయి, వీధి మీటింగులతో పార్టీవాణిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని భావిస్తోంది. అలాగే కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందుతున్న వారి వివరాలు సేకరించి, నిత్యం వారితో టచ్‌లో ఉండేలా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నారు. వీటితో పాటు బీఆర్ఎస్, కాంగ్రెస్ నుంచి చేరికలకు ప్రాధాన్యమిస్తున్నారు. పోల్‌మెనేజ్‌మెంట్‌లో ఎక్కడ కూడా వెనుకడుగు వేయకుండా వ్యూహాత్మకంగా కాషాయ పార్టీ కసరత్తు చేస్తోంది. మొత్తానికి ఓటరే లక్ష్యంగా బీజేపీ ముందుకు సాగుతుండగా.. 40ఏళ్ల తరువాత వరంగల్‌లో కాషాయ జెండా ఎగుతుందనే ఆశలో ఆ పార్టీ శ్రేణులున్నాయి.



చిట్యాల కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న అరూరి రమేష్

మోదీ మేనియా.. అరూరి ఇమేజ్‌పైనే..

దేశవ్యాప్తంగా నరేంద్రమోదీకి ఉన్న చరిష్మాపై బీజేపీ ఆశలు పెట్టుకుంది. ప్రధానంగా అర్బన్ ఓటర్లు మోదీ విధానాలకు అనుకూలంగా ఉన్నట్టు అంచనా వేసుకుంటున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అర్బన్ ప్రాంతాలున్న వరంగల్ తూర్పు నియోజకవర్గంలో 42,783ఓట్లతో బీజేపీ అభ్యర్థి ద్వితీయ స్థానంలో నిలిచారు. అలాగే వరంగల్ పశ్చిమలో 30,826 ఓట్లు, పరకాల అసెంబ్లీ సెగ్మెంట్‌లో 38,593ఓట్లను సాధించింది. అసెంబ్లీ ఎన్నికలకు, ఎంపీ ఎన్నికలకు ఓటరు నాడీ వేరేలా ఉంటుందని, ప్రస్తుతం మోదీ చరిష్మాతో అర్బన్ ప్రాంతాల్లో మెజారిటీ ఓట్లు సాధించవచ్చుననే లెక్కల్లో బీజేపీ శ్రేణులు ఉన్నాయి. అలాగే అరూరి రమేష్ వ్యక్తిగత పరిచయాలు, బలమైన బంధుత్వాలు ఉండటంతో వర్ధన్నపేట, స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గాల్లో కూడా భారీ స్థాయిలో ఓట్లు పడుతాయనే అంచనాల్లో బీజేపీ నేతలున్నారు. ఇక భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో బలమైన కేడర్ ఉండటం తమకు కలిసి వస్తుందనే ఆశతో కమలం పార్టీ నేతలున్నారు. పాలకుర్తి అసెంబ్లీ సెగ్మెంట్‌లో పార్టీ కొంత బలహీనంగా ఉందనే చర్చ జరుగుతోంది. అక్కడ కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను తట్టుకుని కనీసం రెండోస్థానంలోకి రావాలనే వ్యూహంతో బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ 'ఆపరేషన్ లోటస్'ను ప్రారంభించినట్లుగా సమాచారం. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో ఉన్న కీలక నేతలతో రహస్య మంతనాలు జరిపినట్టు ప్రచారం జరుగుతోంది. దీనికి తోడు బీజేపీ ఉమ్మడి వరంగల్ కీలక నేతలు ఐక్యతతో కలిసి పని చేస్తుండటం.. అధిష్ఠానం దూతలుగా మాజీ ఎంపీలు గరకపాటి మోహన్‌రావు, చాడ సురేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు పర్యవేక్షణలో కమలం పార్టీ స్పీడ్ పెంచిందనే చర్చ కేడర్‌లో వినిపిస్తోంది.

కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ పరిశీలన



కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న ధీరజ్‌సింఘూ

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 20: వరంగల్ కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ఎన్నికల కంట్రోల్ రూమ్‌ను ఎన్నికల వ్యయ పరిశీలకులు ధీరజ్ సింఘూ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్టాటిక్ సర్వే లెన్స్ వీడియో సర్వేలెన్స్ బృం దాల లైవ్ స్ట్రీమింగ్‌ను పరిశీలించి, కంట్రోల్ రూమ్ పనితీరును అడిగి తెలుసుకొని పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో ఎన్నికల ప్రకటనలను జిల్లా మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సర్టిఫికేషన్ చేయనున్నట్లు తెలిపారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చే ప్రకటనల రేట్లు, ఎన్నికలకు సంబంధించిన ప్రకటనలు, సోషల్ మీడియా, ఫేక్ న్యూస్, పెయిడ్ న్యూస్ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే సామాజిక మాధ్యమాలలో జరిగే ఎన్నికల కోడ్ ఉల్లంఘ నలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఎన్నికల ఉల్లంఘటనపై ప్రత్యేక దృష్టి సారించడమే కాకుండా ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎప్పటికప్పుడు రికార్డు చేసుకోవాలని అధికారులకు వ్యయ పరిశీలకులు ధీరజ్ సింఘూ సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ శ్రీనివాస్, జిల్లా నోడల్ అధికారులు రామిరెడ్డి, ఆయూబ్ అలీ, కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్, సోషల్ మీడియా సభ్యులు విష్ణు, రామకృష్ణ, రాజ్‌కుమార్, లైజన్ ఆఫీసర్ నయీం తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను పూర్తి చేయాలి: కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 20: పాఠశాల అభివృద్ధి ప్రతిపాదనలను అమ్మ ఆదర్శ కమిటీలు త్వరితగతిన రూపొందించి పనులను జూన్ 10వ తేదీలోగా పూర్తి చేయాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో కమిటీల ద్వారా పాఠశాల అభివృద్ధి పనులపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 647 ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేశామని, వీటిలో ఇప్పటి వరకు 319 పాఠశాలల్లో ప్రతిపాదించిన 78అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు తెలిపారు. మిలిగిన పాఠశాలలు చేపట్టాల్సిన పనులను గుర్తించి వెంటనే ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. కమిటీల ఆధ్వర్యంలో రూ.25వేల లోపు చేపట్టిన మే మొదటివారంలో పూర్తి కావాలని ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో రూ.25వేలు పైబడి గుర్తించిన పనులను జూన్ 10లోగా పూర్తి చేయాలన్నారు. అమ్మ ఎన్నికల పోలింగ్ కేంద్రాలున్న పాఠశాలల్లో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, డీఆర్‌డీఓ కౌసల్యదేవి, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లు, డీఈలు, ఏఈలు, మండల అధికారులు పాల్గొన్నారు.

చల్లబడ్డ వాతావరణం

పలు చోట్ల తేలికపాటి వర్షం

వరంగల్ వ్యవసాయం, ఏప్రిల్ 20: వేసవి ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో జిల్లాలో పలుచోట్ల తేలికపాటి వర్షం కురిసింది. శనివారం నగరంలో ఒక్కసారిగా వాతావరణంలో మార్పు చోటు చేసుకుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వాతావరణం మబ్బులు పట్టి ఉంది. అక్కడక్కడ తేలికపాటి వర్షం కురిసింది. దీంతో చల్లటి గాలులు వీచడంతో నగర ప్రజలు సెద తీరినట్లైంది. హనుమకొండ జిల్లాలో ధర్మసాగర్, కమలాపూర్, ఎలుకతుర్తి మండలాలో కురిసిన తేలికపాటి వర్షాలకు రైతులు కొంత ఇబ్బందులుపడ్డారు. వరి పంట కోతకు వచ్చిన సమయంలో వర్షం కురువడంతో, అలాగే ధాన్యం ఆరబెట్టుకున్న రైతులు తేలికపాటి వర్షానికి తడవకుండా తాటిపత్రులను కప్పుకుని పంటను కాపాడుకునేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు. వరంగల్ జిల్లాలో గీసుగొండ మండలంలో అక్కడక్కడ చిరుజల్లులు కురిశాయి. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. మరోవైపు మామిడి రైతులు భారీ వర్షం కురిస్తే మామిడి పూత, పిందె రాలిపోతుందని ఆందోళన చెందారు. సాయంత్రం వరకు వర్షం కురువకపోవడంతో తేరుకున్నారు.




నగరంలో చిరు జల్లులు

భానుడి భగభగలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు శనివారం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి చిరుజల్లులతో కూడిన వర్షం పడడంతో ఆహ్లానందం పొందారు. ఉదయం వేళ వర్షం ఒక్కసారిగా కురువడంతో ప్రజలు గొడుగులను ఆశ్రయించారు. దాదాపు 20 నిమిషాల వరకు జల్లులతో వర్షం కురిసింది.

శనివారం ఉష్ణోగ్రత
గరిష్ఠం : 31.5°C
కనిష్ఠం : 27.0°C



వంచనగిరిలో ఆరబోసిన ధాన్యం పై తాటిపత్రి కప్పిన రైతులు

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి..

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



ఎల్లాపూర్ వద్ద పనులను పరిశీలిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 20: గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై వేగం పెంచాలని బల్దియా ఇంజనీరింగ్ అధికారులను నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశించారు. శనివారం నగరంలోని పలు అభివృద్ధి పనులను కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కరీంనగర్ రోడ్డు ఎల్లాపూర్ వద్ద గ్రాండ్ ఎంట్రెన్స్ ఏర్పాటు, ఏనుమాముల బాలాజీ జంక్షన్ వద్ద బ్యూటిఫికేషన్ పనులు, నర్సంపేట ప్రధాన రహదారి వద్ద గల గ్రాండ్ ఎంట్రెన్స్ పనులు పరిశీలించి నెలరోజులలోపు పనులు పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇంకా ఎస్ఎన్ఎం క్లబ్ సమీపంలోని బ్యూటిఫికేషన్ పనులు, క్రిష్టియన్ కాలనీ వద్ద నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, ఈఈలు రాజయ్య, సంజయ్‌కుమార్, డీఈలు సంతోష్‌బాబు, రవికుమార్, సారంగం, రంగారావు, కృష్ణమూర్తి, శ్రీకాంత్, ఏఈ హరికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, సంపత్‌రెడ్డి, ఇశం శ్రీను, స్మార్ట్‌సిటీ ప్రతినిధి ఆనంద్ పాల్గొన్నారు.

డీజే నిర్వాహకుడిపై కేసు

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 20: పెళ్లి ఊరేగింపులో అర్ధరాత్రి డీజే సౌండ్స్‌తో ప్రజలను ఇబ్బందిపెడుతున్న డీజే నిర్వాహకుడితోపాటు పెళ్లివారిపై కేసు నమోదు చేసినట్లు హనుమకొండ పోలీసులు తెలిపారు. హనుమకొండ పోచమ్మకుంట ఫైన్ ఫంక్షన్ హాల్ సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి డీజేతో ఇబ్బందిపడుతున్నామని స్థానికులు డయల్ 100కు ఫోన్ చేయగా పోలీసులు డీజే ప్రాంతానికి చేరుకొని నిర్వాహకుడు తాటికొండ సాయి, పెళ్లి వారి నుంచి ముత్తోజ్ అశోక్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కాజీపేట జంక్షన్ మీదుగా సమ్మర్ స్పెషల్ రైళ్లు

కాజీపేట, ఏప్రిల్ 20 : రైళ్లలో వేసవి రద్దీ దృష్ట్యా పలు సమ్మర్ స్పెషల్ రైళ్లను నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైళ్ల వివరాలు ఇలా ఉన్నాయి. సికింద్రాబాద్ - దానాపూర్ రైలు ఏప్రిల్ 28, మే 2, 9, 16, 23, 30, జూన్ 6, 13, 20, 27 తేదీల్లో నడుస్తుంది. ఈ రైలు కాజీపేటలో నిర్ణయించిన తేదీల్లో ఉదయం 10 గంటలకు హాల్టింగ్ ఉంటుంది. దానాపూర్ - సికింద్రాబాద్‌ల మధ్య నడిచే దానాపూర్ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 21, 28, మే 5, 12, 19,28, జూన్ 2, 9, 16, 23, 30 తేదీలలో నడుపనున్నారు. ఈ రైలు నిర్ణయించిన తేదీల్లో కాజీపేటకు మధ్యాహ్నం 1 గంటలకు హాల్టింగ్ సౌకర్యం ఉంటుందని రైల్వే అధికారులు తెలిపారు. ఇవే కాకుండా హైదరాబాద్ - రక్సెల్, హైదరాబాద్ - గోరఖ్ మధ్య సైతం సమ్మర్ స్పెషల్ రైళ్లను నడుపనున్నామని, వాటి షెడ్యూల్ త్వరలో విడుదల చేస్తామని రైల్వే అధికారులు తెలిపారు.

24 నుంచి రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు

▸▸ ఉమ్మడి పది జిల్లాల నుంచి పాల్గొననున్న 50 జట్లు ▸▸ తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పవన్‌కుమార్

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్ 20: తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24నుంచి 27వరకు హనుమకొండ జేఎన్ఎస్‌లోని హ్యాండ్ బాల్ కోర్టులో 6వ తెలంగాణ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ టాలెంట్ హంట్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్ తెలిపారు. శనివారం హనుమకొండ జేఎన్ఎస్‌లోని హ్యాండ్‌బాల్ కార్యాలయంలో క్రీడా పోటీలపై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పవన్‌కుమార్ పాల్గొని ముందుగా క్రీడా పోటీల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి అనంతరం మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉమ్మడి పది జిల్లాల నుంచి హ్యాండ్‌బాల్‌లో ప్రతిభ కలిగిన క్రీడాకారులను వెలికి తీసి వారిని ప్రోత్సహించడానికి తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆదేశాల మేరకు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియే షన్ ఆధ్వర్యంలో 4రోజుల పాటు లీగ్ కమ్, నాకౌట్ పద్ధతిన పండుగ వాతావ రణంలో క్రీడా పోటీలను నిర్వహిస్తామన్నారు. అండర్-15బాలుర విభాగంలో నిర్వహించే ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 50 జట్లు పాల్గొంటాయని, ఇందులో పాల్గొనే క్రీడాకారులకు క్రీడా మైదానం సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో బసతో పాటు ఉచిత భోజన వసతులను కల్పిస్తామన్నారు. రాష్ట్ర స్థాయి టాలెంట్ హంట్ చాంపియన్‌షిప్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబ ర్చిన 100 మంది క్రీడాకారులను ఎంపిక చేసి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలం గాణ (సాట్) సహకారంతో తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యం లో హైదరాబాద్‌లో నెల పాటు ప్రత్యేక శిక్షణ అందిచడానికి కృషి చేస్తామ న్నారు. అత్యుత్తమ ప్రతిభతో రాణించిన క్రీడాకారులకు సాట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పోర్ట్స్ హాస్టల్‌లో ప్రవేశాలు కల్పించడంతోపాటు ఖేలో ఇండి యా హ్యాండ్‌బాల్ పోటీలలో పాల్గొనేలా అవకాశాలను కల్పించాలన్నారు. విజేతలుగా నిలిచిన జట్టుకు ట్రోఫీ, సర్టిఫికెట్లను ప్రదానం చేస్తామన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు నగరబోయిన సాంబశివరావు, సంయుక్త కార్యదర్శి ఇట్యాల శ్రీనివాస్, విజయ్ పాల్గొన్నారు.

కావ్య గెలుపునకు సమష్టిగా కృషి చేద్దాం

▸▸ వరంగల్ లోక్‌సభ ఎన్నికపై మంత్రి శ్రీధర్‌బాబు దిశా, నిర్దేశం

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 20 : వరంగల్ లోక్‌సభ స్థానాన్ని మూడు లక్షల ఓట్ల మెజారిటీతో కైవసం చేసుకోవాలని ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతలకు మంత్రి శ్రీధర్‌బాబు సూచించారు. శనివారం రాత్రి హనుమకొండలోని ఓ హోటల్‌లో శ్రీధర్‌బాబు సమీక్ష జరిపారు. వరంగల్ లోక్‌సభ ఇన్‌చార్జి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డితో పాటు అభ్యర్థి కడియం కావ్య ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజు, గండ్ర సత్యనారాయణ, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, టీపీసీసీ నాయకులు కూచన రవళి, ఈవీ శ్రీనివాస్, డాక్టరు అనిల్‌కుమార్, డాక్టరు రామక్రిష్ణ తదితరులతో సమీక్ష జరిగింది.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, పాల్గొన్న ఎమ్మెల్యేలు తదితర ముఖ్య నేతలు

లోక్‌సభ ఎన్నికలో మెజారిటీ, గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గం వరకు ఎమ్మెల్యేలు, ఇతర నాయకుల బాధ్యతల నిర్వహణ, మెజారిటీ, ప్రచారం, పార్టీ అభ్యర్థి కడియం కావ్య నామినేషన్, 24న సీఎం రేవంత్‌రెడ్డి సభ, తదితర అంశాలను సుదీర్ఘంగా సమీక్షించారు. నిర్వహించాల్సిన అంశాలపై దిశా, నిర్దేశం చేశారు. పార్టీ గెలుపు ఖాయమని, అయితే మెజారిటీ అత్యంత ప్రాధాన్యత విషయమనేది గుర్తించాలని ఉద్బోధించారు. టికెట్ ఆశించి భంగపడ్డ నాయకులతో చర్చించి నచ్చచెప్పాలని సూచించారు. 24 తరువాత ప్రచారాన్ని ఉధృతం చేయాలని, ఈ మేరకు ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు బాధ్యతలు తీసుకోవాలన్నారు. పార్టీ మేనిఫెస్టోను ఇంటింటికి తీసుకెళ్లాలన్నారు. ఈనెల 24న మడికొండలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనే బహిరంగ సభ నిర్వహణ, ఏర్పాట్లు తదితర అంశాలను మంత్రి శ్రీధర్‌బాబు సమీక్షించారు. నియోజకవర్గాల వారిగా శ్రేణులతరలింపు, రవాణా ఇతర విషయాలను చర్చించారు.

వ్యయ పరిశీలన రిజిస్టర్ నిర్వహించాలి

- ఎన్నికల వ్యయ పరిశీలకుడు ధీరజ్‌సింఘూ
- ఎన్నికల పరిశీలకులతో కమిషనర్ భేటీ


కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 20: వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తప్పకుండా ఎన్నికల వ్యయపరిశీలన రిజిస్టర్లు తప్పకుండా నిర్వహించుకోవాలని ఎన్నికల పరిశీలకుడు ధీరజ్‌సింఘూ సూచించారు. గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ కార్యాలయంలో 15- వరంగల్ ఎస్సీ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని వరంగల్ తూర్పు అసెంబ్లీ సెగ్మెంట్ ఏఆర్వో, నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఎన్నికల అధికారులతో శనివారం భేటీ అయ్యారు. ధీరజ్‌సింగా కార్యాలయంలోని పలు ఫైళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా దీరజ్‌సింగా మాట్లాడారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న షాడో అబ్జర్వేషన్ రిజిస్టర్లతో పాటు ఎన్నికలకు సంబంధించిన ఖర్చులను రికార్డులను నమోదు చేయాలని సూచించారు. అభ్యర్థుల అమోద, అమోదయోగ్యం కానీ ప్రతీ ఖర్చును లెక్కించాలన్నారు. అభ్యర్థుల ప్రచారం, ర్యాలీలు, సభలు, సమావేశాలకు సంబంధించిన అన్ని క్లిప్స్ సర్వేలెన్స్ టీములు రికార్డు చేయాలన్నారు. అభ్యర్థుల పూర్తి వివరాలు ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు అందించాలని చెప్పారు. ప్రచార ఖర్చులు నిర్ణయించిన ధరల ప్రకారం నమోదు చేయాలని అన్నారు. పోటీచేసే అభ్యర్థులు అన్ని రకాల కర్చులు తప్పకుండా పక్కా లెక్క ఉండాలన్నారు. కార్యక్రమంలో సహాయ వ్యయపరిశీలకులు మానస, అకౌంటింగ్ టీం సిబ్బంది ఖీరానాయక్, లింగస్వామిలతో పాటు పలు శాఖల సిబ్బంది ఉన్నారు.

ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలి

- వరంగల్ తూర్పు స్వీప్ నోడల్ అధికారి రాజేశ్‌కుమార్



కార్యక్రమంలో మాట్లాడుతున్న నోడల్ అధికారి రాజేశ్‌కుమార్

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 20 : ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని వరంగల్ తూర్పు స్వీప్ నోడల్ అధికారి రాజేశ్ కుమార్ అన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా శనివారం బల్దియా కార్యాలయం ఆవరణలోని మెప్మా కార్యాలయంలో ఓటు హక్కుపై లోక్‌సభ నియోజక వర్గం పరిధి -106 (వరంగల్ తూర్పు) స్వీప్ -2024 అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏకశిల పట్టణ సమాఖ్య సభ్యులకు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజేశ్ కుమార్ హాజరై మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటు అవగాహనపై ప్రజల్లో విస్తృత అవగాహన తీసుకురావాలని అన్నారు. అదే విదంగా ఈ నెల 25న ఉదయం 8 గంటలకు నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎంసీ రమేష్, సీవోలు నాగరాజు, సఫియా, ఆర్‌పీలు పాల్గొన్నారు.

వరంగల్‌లో మూడో రోజు నాలుగు నామినేషన్లు


వరంగల్ పార్లమెంట్ ఆర్‌వో ప్రావీణ్యకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ఎంసీపీఐ(యూ) అభ్యర్థి సావిత్రి


నామినేషన్ పత్రాలు అందజేస్తున్న స్వతంత్ర అభ్యర్థి గాదెపాక అనిల్‌కుమార్


నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థి మేకల సుమన్

వరంగల్ కలెక్టరేట్/మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 20: పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా జరుగుతోంది. మూడో రోజైన శనివారం వరంగల్ పార్లమెంట్ స్థానానికి నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. వరంగల్ కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరించారు. ఎంసీపీఐ(యూ) అభ్యర్థి మాస్ సావిత్రి ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థి గాదెపాక అనిల్‌కుమార్ ఒకసెట్, ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థి మేకల సుమన్ ఒకసెట్ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. మరో స్వతంత్ర అభ్యర్థి బరిగెల శివ తొలిరోజున ఒక సెట్ వేయగా, శనివారం మరోసెట్ పత్రాలను అందజేశారు. ఇకమహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి మూడో రోజు శనివారం

మహబూబాబాద్‌లో నిల్

ఒక్క నామినేషన్ కూడా దాఖలవలేదు. ఈ నెల 18న తొలి రోజు ఒకరు, 19న రెండవ రోజు నలుగురు నామినేషన్లు వేశారు. కాగా, 22వ తేదీ సోమవారం బీజేపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్, 23న బీఆర్ఎస్ అభ్యర్థిగా మాలోతు కవిత నామినేషన్లు వేయనున్నారు.

సమాచారమంతా చరవాణిలోనే..

- సీ-విజిల్‌తో ఎన్నికల ఉల్లంఘనలకు అడ్డుకట్ట



వరంగల్ సిటీ, ఏప్రిల్ 20 : ప్రస్తుతం డిజిటల్ యుగం నడుస్తోంది. గతంతో పోలిస్తే ఇప్పుడు డిజిటల్ అక్షరాస్యత పెరిగిపోయింది. ప్రతీ ఇంట్లో చరవాణి(మొబైల్), ప్రతీ మనిషికో చరవాణి మామూలైపోయింది. ఈ అంశాన్నే కేంద్ర ఎన్నికల సంఘం పరిగణలోకి తీసుకుంది. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం పక్కాగా ప్లాన్ చేసింది. ప్రతీ విషయం ఓటరు తెలుసుకునేలా యాప్‌లను రూపొందించింది. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై ఓటర్లు ఫిర్యాదు చేసేందుకు, ప్రలోభాలు, అక్రమాలను అరికట్టేందుకు, అభ్యర్థుల వివరాలను తెలుసుకునేందుకు ఇలా ప్రతీ సమాచారం అందుబాటులో ఉంచుతోంది. బరిలో నిలిచే అభ్యర్థులు సైతం ఆన్‌లైన్ ద్వారానే సభలు, సమావేశాల నిర్వహణకు అనుమతులు తీసుకునేలా అవకాశం కల్పించింది. భారత ఎన్నికల సంఘం రూపొందించిన యాప్‌లను స్మార్ట్ ఫోన్‌లలో ప్లే స్టోర్‌లోకి వెళ్లి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

సీ-విజిల్‌తో..



అలాగే కోడ్ ఉల్లంఘన, వ్యయ ఉల్లంఘన జరిగితే వెంటనే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడానికి సీ-విజిల్ యాప్‌ను ఉపయోగించండి. నగదు, మద్యం, మాదక ద్రవ్యాల పంపిణీ, ఓటర్లను ప్రలోభపెట్టు వస్తువుల పంపిణీ, ప్రజల ఆస్తులను పాడుచేయడం, కుల, మత ద్వేషాలను రెచ్చగొట్టే ప్రసంగాలు జరిగితే ఫిర్యాదు చేయవచ్చు. అలాగే అసత్య వార్తల ప్రసారం, ఓటర్లను బెదిరించడం, చెల్లింపు వార్తలు, మారణాయుధాలు కలిగియుండుట, ఓటర్ల రవాణా ఇలాంటివన్నీ ఎన్నికల నియమావళి ఉల్లంఘనల కిందకే వస్తాయి. వీటిపై సీ-విజిల్ ద్వారా ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. మీరు చేసిన ఫిర్యాదుకు వెంటనే ఎన్నికల అధికారులు స్పందిస్తారు. ఐదు నిమిషాల వ్యవధిలో జిల్లా ఎన్నికల అధికారి వెరిఫికేషన్ కోసం ఫీల్డ్ యూనిట్‌కు ఫిర్యాదును కేటాయిస్తారు. 15 నిమిషాలలో ఫీల్డ్ టీమ్, ఫిర్యాదు చేసిన స్థలానికి చేరుకుంటుంది. 30 నిమిషాలలో ఫీల్డ్ టీం చర్య అమలు చేసి నివేదిక పంపిస్తారు. 50 నిమిషాలలో రిటర్నింగ్ అధికారి ఫిర్యాదుపై చర్యలు చేపడుతారు.

అదుపు తప్పి ఫ్లైయాష్ లోడ్ లారీ బోల్తా

- డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



మడికొండ, ఏప్రిల్ 20 : ఔటర్ రింగ్‌రోడ్డుపై ఫ్లైయాష్ లోడ్ లారీ అదుపు తప్పి బోల్తా పడడంతో లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మడికొండ ఏఎస్సై చంద్రమౌళి తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం తెల్లవారుజామున భూపాలపల్లి నుంచి సూర్యాపేటకు ఫ్లైయాష్ లోడ్‌తో వెళ్తున్న లారీ కాజీపేట మండలం టేకులగూడెం క్రాస్ వద్ద ఔటర్ రింగ్ రోడ్ పై అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ప్రమాదంలో లారీ డ్రైవర్ గుగులోత్ నితిన్ లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. 100 డయల్ సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించి వారి సహాయంతో డ్రైవర్‌ను క్యాబిన్‌లో నుంచి బయటకు తీసి ఎంజీఎంకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. కాగా, లారీ డ్రైవర్, ఓనర్‌లు సూర్యాపేటకు చెందిన వారని ఏఎస్సై తెలిపారు.

నామినేషన్ కౌంటర్

మూడో రోజు (20-4-2024)

	దాఖలైన మొత్తం నామినేషన్లు	
	వరంగల్	మహ-బాద్
మూడో రోజు (20-4-2024)	11	6

వరంగల్ (ఎస్సీ)	: మాస్ సావిత్రి (ఎంసీపీఐ), మేకల సుమన్ (ధర్మ సమాజ్ పార్టీ), గాదెపాక అనిల్‌కుమార్ (స్వతంత్ర), బరిగెల శివ (స్వతంత్ర)
మహబూబాబాద్(ఎస్టీ)	: లేవు.



వీవీ ప్యాట్, ఈవీఎంల తేడా



వరంగల్ కలెక్టరేట్ : ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్(ఈవీఎం), ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయల్(వీవీ ప్యాట్). అభ్యర్థి పేరు, గుర్తు, సీరియల్ నెంబరు అన్ని కనిపిస్తాయి. ఇలా 7 సెకన్లు మాత్రమే ఉంటుంది. ఈవీఎంలలో కంట్రోల్ యూనిట్, బ్యాలెటింగ్ యూనిట్‌లు ఉంటాయి. కంట్రోల్ యూనిట్ పోలింగ్ ఆఫీసర్ దగ్గర, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్ ఓటు వేసే ఓటరు దగ్గర ఉంటాయి. పోలింగ్ ఆఫీసర్ యాక్టివేట్ చేస్తేనే ఓటు వేసే అవకాశం ఉంటుంది.

నిబంధనలు ఉల్లంఘిస్తే శిక్ష



వరంగల్ కలెక్టరేట్ : ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951 ప్రకారం ఎన్నికల నిబంధనలు ఎవరైనా ఉల్లంఘించినట్లయితే రెండు సంవత్సరాల పాటు జైలు శిక్ష, జరిమానా విధిస్తారు. అభ్యర్థులు బాధ్యతాయుతంగా ఖాతాల వివరాలను ఎన్నికల అధికారులకు తెలియపర్చాలి. ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనలు, పెయిడ్ న్యూస్, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టులను ఉల్లంఘనగా పరిగణిస్తారు.

వెబ్‌సైట్‌లో సమగ్ర సమాచారం



వరంగల్ కలెక్టరేట్ : ఎన్నికలకు సంబంధించిన సమగ్ర సమాచారం అందుబాటులో ఉండేలా కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను రూపొందించింది.

ceotelangana.nic.in వెబ్‌సైట్‌లో ఓటరు నమోదుతో పాటు ఓటరు జాబితాలో పేరు, తొలగింపు, సవరణలు చేసుకోవచ్చు. అలాగే పోలింగ్ కేంద్రం వివరాలతో పాటు పార్లమెంట్ నియోజకవర్గాల వారిగా గతంలో పోటీ చేసిన అభ్యర్థుల వివరాలు కూడా వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

కష్టకాలంలో తోడున్న వారే నిజమైన కార్యకర్తలు

- ద్రోహులకు బీఆర్ఎస్ కార్యకర్తలు గుణపాఠం చెప్పాలి
- శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్
- పరకాలలో బీఆర్ఎస్ లోక్‌సభ స్థాయి సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ బండా ప్రకాశ్

పరకాల, ఏప్రిల్ 20: కష్టకాలంలో తోడున్న వారే పార్టీకి నిజమైన కార్యకర్తలని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ అన్నారు. పట్టణంలోని లలితా కన్వెన్షన్ హాలులో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అధ్యక్షతన శనివారం బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బండా ప్రకాశ్ మాట్లాడుతూ.. అధికార దాహం కోసం పార్టీ మారే నాయకులు, కార్యకర్తలు పార్టీకి అవసరం లేదని, ఎందరు వెళ్లినా వరంగల్ ఎంపీ స్థానం బీఆర్ఎస్ అధిక మెజార్టీతో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. ఎన్నికల్లో అబద్ధాల హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పే రోజు వచ్చిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగస్టు 15న రైతులకు రుణమాఫీ చేస్తామని ఇప్పటి కూడా కల్లబొల్లి మాటలు చెబుతున్నాడని అన్నారు. బ్రోకర్లే పార్టీలు మారుతున్నారు తప్పా.. నిజమైన కార్యకర్తలు పార్టీలోనే ఉన్నారని తెలిపారు. కడియం శ్రీహరిని తన తండ్రి చదివించాడని, అలాంటి వాడు తనను వ్యతిరేకించి మాట్లాడటం సరైంది కాదన్నారు. ఎన్నో కష్టాలకు ఓర్చి కాళేశ్వరం ప్రాజెక్టు కడితే రైతులు ఎంతో మంది మూడు పంటలు పండిస్తున్నారని, ఒకటి రెండు పిల్లర్లు కుంగితే కాంగ్రెస్ వాళ్లు వేలెత్తి చూపడం సరికాదన్నారు.

బీఆర్ఎస్ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ అండతో ఎదిగిన కడియం శ్రీహరి, అరూరి రమేశ్ ద్రోహులుగా నిలిచారని, ఎన్నికల్లో వారికి ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికలు మోసానికి, న్యాయానికి మధ్య జరిగే పోరు అని అన్నారు. బీఆర్ఎస్ పార్టీలో ఎన్నో అబద్ధాలు చెబుతూ ఎన్నో పదవులు పొంది, ఎంతో సంపాదించుకున్న కడియం శ్రీహరి మోసకారి అన్నారు. దమ్ము, ధైర్యం ఉంటే కడియం శ్రీహరి తన ఎమ్మెల్యే పదవిని రాజీనామా చేసి మళ్లీపోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు. ప్రతీ ఒక్క కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి కడియం శ్రీహరి చేసిన ద్రోహం వివరించాలని పిలుపునిచ్చారు.

కడియం శ్రీహరి నకిలీ దళితుడు

కడియం శ్రీహరి నకిలీ దళితుడు అని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. దళితద్రోహి, అవినీతి చక్రవర్తి, చరిత్రహీనుడు, దళిత హక్కులను దోచుకునేవ్యక్తి కడియం శ్రీహరి అని ధ్వజమెత్తారు. తాను మాదిగ కులానికి చెందినవాడినని, కడియం శ్రీహరికి దమ్ముంటే ఆయన కులం ఏమిటో చెప్పాలని నిలదీశారు. బైండ్ల కులంలో చేరి దళిత హక్కులను దోచుకుతింటున్నాడని ఆరోపించారు. కన్నతల్లి లాంటి బీఆర్ఎస్ పార్టీకి, దేవుడు లాంటి కేసీఆర్‌ను మోసం చేసి నకిలీ కులం పేరుతో బిడ్డను రాజకీయాల్లో దింపి గెలిపించుకునే ప్రయత్నం చేస్తున్నాడని అన్నారు. ధైర్యం ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని, తానూ పోటీ చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, లింగంపెల్లి కిషన్‌రావు, శోభన్‌బాబు, వాసుదేవరెడ్డి, ఏనుగుల రాకేశ్‌రెడ్డి, పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోదీ ఉంటేనే దేశానికి భద్రత

- పథకాల పేరుతో కాంగ్రెస్ మోసం
- వరంగల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా
- బీజేపీ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేష్


శాయంపేట రోడ్‌షోలో మాట్లాడుతున్న అరూరి రమేష్

శాయంపేట, ఏప్రిల్ 20 : నరేంద్ర మోదీ ప్రధానిగా ఉంటేనే భారత దేశానికి రక్షణ ఉంటుందని బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం రాత్రి భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి చందుపట్ల కీర్తిరెడ్డితో పాటు మండల కేంద్రంలో అరూరి రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. పదేళ్లుగా దేశంలో ఎలాంటి అవినీతి, కుంభకోణాలు లేకుండా బీజేపీ సుపరిపాలన కొనసాగిస్తోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించకపోయినా కేంద్రం పెద్దన్న పాత్ర పోషిస్తూ రాష్ట్రాల అభివృద్ధికి పెద్దపీట వేసిందని కొనియాడారు. ఆర్టికల్ 370 రద్దులాంటి చారిత్రాత్మకమైన నిర్ణయాలు జరిగాయని అన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం అక్కడి ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వ కార్యక్రమాలతోపాటు సొంతంగా అనేక సేవా కార్యక్రమాలు చేశామని అన్నారు. వరంగల్ ఎంపీగా గెలిపిస్తే దేశంలోనే వరంగల్ లోక్‌సభ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. మామునూరు ఎయిర్‌పోర్టు పునరుద్ధరణ, భూపాలపల్లి రైల్వేలైన్ నిర్మాణం, టెక్స్‌టైల్ పార్క్ విస్తరణ లాంటి అనేక లక్ష్యాలు పెట్టుకున్నట్లు స్పష్టం చేశారు.

అసెంబ్లీ ఎన్నికల్లో సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ గెలిచిందని అరూరి ఆరోపించారు. ఇప్పటివరకు హామీలు అమలు చేయలేదని అన్నారు. లోక్‌సభ ఎన్నికలలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను చిత్తుగా ఓడించి. మోదీని ప్రధాని చేయడానికి బీజేపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు నాగపురి రాజమౌళి, మార్తినేని ధర్మారావు, చందుపట్ల సత్యపాల్‌రెడ్డి, వన్నాల శ్రీనివాసులు జిల్లా నాయకులు రాయరాకుల మొగిలి, నరహరిశెట్టి రామక్రిష్ణ, వనం దేవరాజు, నాగరాజు, కోమటి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


బాలరాజు (ఫైల్)

ఐనవోలు, ఏప్రిల్ 20 : కుటుంబంలో కుమారుడు, తల్లి వరుసగా మృతిచెందడంతోపాటు తండ్రి, కూతురు అనారోగ్యానికి గురికావడంతో మనస్తాపానికి గురైన ఓవ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వెంకటాపురంలో చోటుచేసుకుంది. ఎస్సై అనిల్‌కుమార్ కథనం ప్రకారం.. అదే గ్రామానికి చెందిన కొసుకొండ బాలరాజు (32) శుక్రవారం పురుగుల మందు తాగగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. బాలరాజు కుమారుడు సాయి మూడేళ్ల వయస్సులో కిందటేడు అనారోగ్యంతో మృతిచెందగా, తల్లి సోమమ్మ రెండు మాసాల కిందట మృతి చెందింది. కూతురు వైష్ణవి మానసిక వికలాంగురాలు, తండ్రి మల్లయ్య పది రోజుల కిందట పక్షవాతానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులిద్దరు మృతిచెందడం.. ఇద్దరు అనారోగ్యానికి గురికావడంతో మనోవేదనకు గురైన బాలరాజు.. జీవితంపై విరక్తి చెంది ఐనవోలు శివారులోని జామాయిల్ తోటలో పురుగుల మందు తాగాడు. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య ఉంది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రేపు ఉమ్మడి జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్ 20: జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ డీఎస్ఏ బాక్సింగ్ హాల్‌లో హనుమకొండ, వరంగల్ జిల్లాల స్థాయి యూత్ మెన్ అండ్ ఉమెన్ బాక్సింగ్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి. రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈ నెల 26నుంచి 28వరకు హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి యూత్ బాక్సింగ్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులు 1జనవరి 2006 నుంచి 31 డిసెంబరు 2007 మధ్య జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు తమ ఒరిజినల్ ఆధార్‌కార్డు, బర్త్ సర్టిఫికెట్, మెడికల్ సర్టిఫికెట్‌లను వెంట తీసుకొని ఈ నెల 21న హనుమకొండ డీఎస్ఏ బాక్సింగ్‌హాల్‌లో ఉదయం 7గంటలకు రిపోర్టు చేయాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు సెల్ 9959711609 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

'అడ్మిషన్ల పేరుతో ఫీజులను దండుకుంటున్నారు'

ఖిలావరంగల్, ఏప్రిల్ 20: అడ్మిషన్ల పేరుతో ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు, తల్లిదండ్రుల నుంచి ఫీజులను దండుకుంటున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదళ్ల శరత్ విమర్శించారు. శనివారం శివనగర్‌లోని తమ్మెర భవన్‌లో ఏఐఎస్ఎఫ్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 విద్యాసంవత్సరానికి అడ్మిషన్ల ముసుగులో ఫీజుల మోత మోగిస్తున్నారన్నారు. మరికొన్ని కొన్ని స్కూల్స్ అప్పుడే అడ్మిషన్లు పూర్తయినట్లు ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు చెప్పడం బాధాకరమన్నారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా నాయకులు మౌటం శివకుమార్,అబిరామ్, ప్రభాస్, సంతోష్, రాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శరత్



సెల్‌టవర్‌ను తొలగించాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న ప్రజలు

సెల్‌టవర్‌ను తొలగించాలని ఎమ్మెల్యే ఆదేశం

వరంగల్ చౌరస్తా, ఏప్రిల్ 20: రామన్నపేటలోని రజకవాడలో ఏర్పాటు చేసిన సెల్‌టవర్‌ను అక్కడి నుంచి తొలగించాల్సిందిగా అధికారులను పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆదేశించారు. గత రాత్రి రామన్నపేటలో రజక వాడలో సాంబారి సురేందర్ అనే వ్యక్తి తన ఇంటిపై రాత్రికి రాత్రే సెల్‌ఫోన్ టవర్‌ను నెలకొల్పారు. ఇంతకుముందు వేరొక సెల్ టవర్‌ను ఏర్పాటు చేయడంతో చుట్టు పక్కల వారు అనారోగ్యంతో గురవుతున్నారన్నారు. టవర్‌ను తొలగించాల్సిందిగా కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు ఓరుగంటి పూర్ణ, మాజీ కార్పొరేటర్ బుద్ధ జగన్, కాసం పున్నంలు ఎమ్మెల్యేకు పత్రం అందజేశారు. దీంతో ఆయన స్పందించారు.

కార్పొరేట్ కళాశాలల స్కీంకు దరఖాస్తు చేసుకోండి

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 20: జిల్లాలో 90శాతానికి పైగా ఉత్తీర్ణత సాధించిన ప్రయివేట్ జూనియర్ కళాశాలలను 2024-25 విద్యా సంవత్సరానికి కార్పొరేట్ కళాశాలల స్కీంలో చేర్చేందుకు యాజమాన్యం పేరు నమోదు చేసుకోవాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి భాగ్యలక్ష్మీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27వ తేదీలోపు www.telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో కళాశాల పేరు నమోదు చేసుకొని సంబంధిత హార్డ్‌కాపీని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

ఆక్రమణలో బస్టాప్‌లు..

శిథిలావస్థలో నగరంలోని బస్ షెల్టర్లు
ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన వ్యాపారులు
షెల్టర్లు నిర్మించాలంటున్న ప్రయాణికులు

గిర్మాజీపేట, ఏప్రిల్ 20 : వరంగల్ నగరంలోని పలు ఆర్టీసీ సిటీ బస్టాప్‌లు ఆక్రమణకు గురవుతున్నాయి. బస్ షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగరంలో ఆర్టీసీ బస్సు సదుపాయం అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి ప్రయాణికులకు సేవలందించిన పలు బస్‌స్టాప్‌లు ఆర్టీసీ, వరంగల్ మహానగర పాలక సంస్థ, కుడా, ట్రాఫిక్ పోలీసు అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఫుట్‌పాత్, స్థానిక వ్యాపారుల ఆక్రమణలతో కనుమరుగు అవుతున్నాయి. బస్ స్టాప్‌లలో షెల్టర్లు లేకపోవడంతో బస్సులు ఆగని పరిస్థితి నెలకొంది.

పోచమ్మమైదాన్ జంక్షన్ నుంచి మండిబజార్ మీదుగా వరంగల్ రైల్వే స్టేషన్ వరకు ప్రధాన రహదారిపై ఆర్టీసీ సిటీ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇందుకు గాను మండిబజార్, లక్ష్మీ టాకీసు, స్టేట్ బ్యాంకు, వరంగల్ చౌరస్తా, వరంగల్ హెడ్ పోస్టాఫీసులను సిటీ బస్ స్టాప్‌లుగా ఆర్టీసీ గుర్తించి బస్సులను ఆపుతోంది. గతంలో ఈ బస్‌స్టాప్‌లలో ప్రయాణికుల కోసం షెల్టర్లను ఏర్పాటు చేసింది. కాలక్రమేణా బస్ షెల్టర్లు పూర్తిగా శిథిలం కావడంతో కనుమరుగై బస్‌స్టాప్‌లు కాస్త ఫుట్‌పాత్ వ్యాపారుల ఆక్రమణలోకి వెళ్లాయి. వాటి స్థానంలో ఫుట్‌పాత్ వ్యాపారులు తమ వ్యాపారం చేస్తుండడంతో ప్రయాణికులు ఎక్కడ నిలబడాలో తెలియని పరిస్థితి నెలకొంది. మండిబజార్, వరంగల్ చౌరస్తాలో రెండు వైపులా బస్ స్టాప్‌లను వ్యాపారులు ఆక్రమించారు. గతంలో వరంగల్ చౌరస్తాలో హనుమకొండ వైపు బస్‌షెల్టర్ ఉండేది. తమ వ్యాపారాలకు అడ్డుగా ఉందని బస్ షెల్టర్ ఆనవాలు లేకుండా చేశారు. బస్సుల కోసం పరిగెడుతుండడంతో ప్రమాదాలకు గురవుతున్నామని పలువురు ప్రయాణీకులు వాపోతున్నారు.

వరంగల్ సిటీలో లక్ష్మీటాకీసు బస్‌స్టాప్ చాలా ముఖ్యమైనది. ఆర్టీసీ బస్సులు అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి లక్ష్మీ టాకీసు బస్టాప్ ఉంది. చార్‌బౌళి, గిర్మాజీపేట, బొడ్రాయి, నిజాంపురా, ఎల్లమ్మబజార్, పిన్నావారి వీధి ప్రజలకు ఈ బస్‌స్టాప్ ఉపయోగకరంగా ఉంటోంది. ఈ ప్రాంతంలోనే పలు ఆస్పత్రులు, సూపర్ స్పెషాలిటీ వైద్యులు, క్లినిక్‌లు ఉండటంతో నిత్యం ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రాంతాల నుంచి ప్రజలు వైద్య సేవల కోసం వస్తుంటారు. అయితే లక్ష్మీ టాకీసు స్థానంలో షాపింగ్ కాంప్లెక్ రావడంతో బస్టాప్ కాస్త వాహనాల పార్కింగ్ స్థలంగా మారింది. షాపింగ్ వాహనాలు సెల్లార్‌లో పెట్టకుండా బస్టాప్ ప్రాంతంలో పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఇక్కడ సిటీ బస్సులు ఆపకపోవడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల పార్కింగ్‌తో ట్రాఫిక్‌కు ఇబ్బందికరంగానే కాకుండా బస్టాప్ లేకుండా పోయిందని ప్రయాణీకులు ఆందోళన చెందుతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి ఇక్కడ బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



లక్ష్మిటాకీసు బస్‌స్టాప్‌లో షెల్టర్ స్థలంలో నిలిపిన వాహనాలు



హెడ్‌పోస్టాఫీసు బస్‌షెల్టర్ స్థలంలో ఏర్పాటు చేసిన వీధి వ్యాపారాలు

ఆక్రమణలో ఖాళీ స్థలం..

వరంగల్ హెడ్‌పోస్టాఫీసు సెంటర్ సిటీ బస్‌స్టాప్ శివనగర్ వైపు వెళ్లేందుకు, సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రికి పోయేందుకు, గిర్మాజిపేట, గోవిందరాజుల గుట్ట తదితర ప్రాంతాల ప్రజలకు చాలా ఉపయోగకరం. ఇక్కడ గతంలో మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ ఉండటంతో ఈ షాపుల ముందే బస్సులు ఆగుతుండేవి. అయితే బస్ షెల్టర్‌కు స్థలం లేకపోవడంతో ప్రయాణీకులు షాపుల ముందు నిల్చునేవారు. అయితే ఫుట్‌పాత్ ఆక్రమణలతో నిత్యం ట్రాఫిక్ పద్మవ్యూహంగా ఉంటున్న వరంగల్ హెడ్‌పోస్టాఫీసు సెంటర్‌ను అభివృద్ధి పేరుతో లక్షల రూపాయల ఆదాయం ఇచ్చే షాపింగ్ కాంప్లెక్స్‌ను కుడా, గ్రేటర్ మునిసిపల్ అధికారులు కూలగొట్టారు. ఈ ఖాళీ స్థలం బస్ షెల్టర్‌కు చాలా అనుకూలంగా ఉంది. అయితే స్థానిక ఫుట్‌పాత్ వ్యాపారులు, పూల వ్యాపారులు ఆక్రమించుకుని వ్యాపారం చేసుకుంటున్నారు. ఆర్టీసీ, కుడా, మునిసిపల్ కార్పొరేషన్, ట్రాఫిక్ పోలీసు అధికారులు మండిబజార్ నుంచి వరంగల్ రైల్వేస్టేషన్ వరకు పర్యటించి దశాబ్దాల నాటి బస్‌స్టాప్‌లు, ఉన్న బస్ షెల్టర్‌లలో స్థానిక వ్యాపారుల ఆక్రమణలు తొలగించి బస్సులు ఆగేలా అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా చంద్రబాబునాయుడి జన్మదిన వేడుకలు



వరంగల్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న రవీందర్

వరంగల్ చౌరస్తా, ఏప్రిల్ 20: విజన్ -2020 పేరుతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించిన జ్ఞానశీలి, హైదరాబాద్‌ను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దిన నాయకుడు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి చిలువేరు రవీందర్ అన్నారు. శనివారం జాతీయ టీడీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడు 74వ జన్మదిన వేడుకలను వరంగల్ టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసిన అనంతరం మాట్లాడుతూ బిల్‌క్లింటన్, బిల్‌గెట్స్ వంటి గొప్ప వ్యక్తులను హైదరాబాద్‌కు తీసుకొచ్చిన ఘనత బాబుదేనన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సిరబోయిన రాజు, కంద్రాతి చిన్న రవి, ఎన్టీఆర్ మొగిలి, కంద్రాతి రాజు, శ్రీకాంత్, పిట్టల శ్రీనివాస్, పిట్ట సత్యనారాయణ, పోలెపాక సాయికుమార్, సింగారపు మురళి, బురపట్ల నాగరాజు, అనుముల రాజు పాల్గొన్నారు.

● పోచమ్మమైదాన్: ఆటోనగర్‌లోని లూయిస్ ఆదర్శ అంధుల పాఠశాలలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు నిర్వహించారు. చంద్రబాబు యువ సేన జాతీయ అధ్యక్షుడు చెన్నోజు రఘుబాబు ఆధ్వర్యంలో అంధ విద్యార్థుల మధ్య కేక్ కట్ చేశా రు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పిట్టల శ్రీనివాస్, కాగితాల జయశంకర్, కందుకూరి నరేష్, కండాత్రి శ్రీకాంత్, చిన్న రవన్న, శ్రీనివాస్, జాఫర్ పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ మాలధారణ

గీసుగొండ, ఏప్రిల్ 20: కొనాయిమాకుల ప్రముఖ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో 41 రోజులు మండల దీక్షకు హనమాన్ భక్తులు శనివారం మాలధారణ వేసుకున్నారు. వారికి అయ్యప్పశర్మ మాలధారణలు చేయించారు. ఈనెల 23 వరకు 41 రోజుల మండల దీక్ష మాలధారణలు జరుగుతాయని అయ్యప్పశర్మ చెప్పారు. 21 రోజులు అర్ధమండల దీక్షలు మే 7 నుంచి 12 వరకు, 11 రోజులు దీక్షలు, మే18నుంచి 22 వరకు భక్తులు చేపట్టవచ్చని తెలిపారు. మాలధారణలకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు ఆనంద్‌సా సోదరులు తెలిపారు. ఎంతో విశిష్టత గల పంచముఖ అంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ దీక్షలను స్వీకరించేందుకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలిరావటం ఆనవాయితీగా వస్తుంది. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది.



మాలధారణ చేస్తున్న భక్తులు

పెట్రోల్ మంటల్లో కాలిన దంపతులు

● ఎంజీఎంకు తరలింపు ● భర్త మొదటి భార్య కేసు విషయంలో గొడవ



ఎంజీఎంలో చికిత్స పొందుతున్న మజార్, ఫాతిమా, పక్కన పెళ్లి నాటి చిత్రం

సంగెం, ఏప్రిల్ 20 : భార్యాభర్తల మధ్య తలెత్తిన మనస్పర్థలతో ఆ దంపతులు పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం. గ్రేటర్ వరంగల్ 43వ డివిజన్‌లోని సత్యసాయి నగర్ కాలనీలో మజార్ (30), అజీమీ ఫాతిమా (26) దంపతులు అద్దె ఇంట్లో ఉంటున్నారు. మజార్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మజార్ తన మొదటి భార్యతో గొడవలు జరిగ్గా, ఆ కేసు కోర్టులో ఉంది. ఈ కేసు నడుస్తుండగా ఫిబ్రవరిలో వరంగల్‌లోని చార్‌బౌళికి చెందిన అజిమా ఫాతిమాను మజార్ రెండో వివాహం చేసుకున్నాడు. ఫాతిమాకు కూడా ఇది రెండో వివాహం. మజార్ మొదటి భార్య సంబంధించిన కేసు విషయమై ఇద్దరి మధ్య శనివారం ఉదయం గొడవ జరిగింది. మధ్యాహ్నం పెట్రోల్ తీసుకొచ్చి ఆటోలో పోస్తుండగా ఇద్దరిమధ్య మరోసారి మాటామాటా పెరిగింది.

దీంతో ఇద్దరు పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నారు. తీవ్రంగా గాయపడిన వారిని పోలీసులు చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని తెలుస్తోంది. ఫాతిమా పెట్రోల్ డబ్బా తీసుకుని పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుందని మజార్ చెబుతుండగా, మజారే ఫాతిమాపై పోసి నిప్పంటించాడని ఫాతిమా కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కాగా, ఎవరిపై ఎవరు పెట్రోల్ పోశారనే విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నట్లు మామునూరు సీఐ రవి కుమార్ తెలిపారు.

శేష వాహనంపై ఊరేగిన సీతారాములు

కరీమాబాద్, ఏప్రిల్ 20 : రంగశాయిపేటలో జరుగుతున్న సీతారాముల కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారిని శేషవాహనంపై ఊరేగించారు. సీతారామ లక్ష్మణ, హనుమాన్ ఉత్సవ విగ్రహాలను రామాలయం నుంచి రథసేవకులు ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో మంగళహారతులు పట్టారు. ఆలయ పూజారి తిరుమల శ్రీధరాచార్యుల ఆధ్వర్యంలో ఆలయ ఫౌండర్ ట్రస్టు చైర్మన్ పులిగిళ్ళ వేంకట రామ నర్సింహ శాస్త్రి, ధర్మకర్తలు వద్దిరాజు రంగారావు, శ్యామ్‌సుందర్‌రావు, లక్ష్మీకాంతారావుల పర్యవేక్షణలో ఉదయం హంస సేవ, గ్రామ బలిహరణ కార్యక్రమాలు వేద మంత్రోచ్చరణలతో నిర్వహించారు.

ఉత్సవాలలో భాగంగా ఆదివారం ఆలయ పరిసరాల్లో పారువేట (బండ్ల జాతర) జరుగనుంది. ఉదయం పూర్ణాహుతి తదనంతరం ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పులిగిళ్ళ వేంకటనర్సింహ శాస్త్రి ఇంటికి ఆచారం ప్రకారం రాముల వారు అలుకకు వచ్చే కార్యక్రమం నిర్వహించనున్నారు. బండ్ల జా తర సందర్భంగా ఆలయ పరిసరాల్లో పలు దుకా ణ సముదాయాలు వెలిసాయి. ఉత్సవ నిర్వహకులు జాతరకు కావాల్సిన ఏర్పాట్లను చేస్తున్నారు.



ముగిసిన ఆయుకార్ భవన్ ఆయుష్షు



ఆయుకార్ భవన్

వరంగల్ చౌరస్తా, ఏప్రిల్ 20: వరంగల్ నగరంలో స్వాతంత్ర్యం సిద్ధించిన అనంతరం చారిత్రక కట్టడాలు నిర్మాం జరిగిన వాటిలో వరంగల్‌లోని ఆయుకార్ భవన్ ఒకటి. వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలో ఈ భవన్‌లో ఆదాయపు పన్ను శాఖ జోనల్ కార్యాలయం కార్యకలాపాలు నిర్వహిస్తోంది. హైదరాబాద్ తర్వాత అతిపెద్ద నగరంగా ఉన్న

కొత్త భవన నిర్మాణానికి ప్రతిపాదనలు

వరంగల్‌కు సంబంధించి వ్యాపార, వాణిజ్య సంబంధించిన ఆదాయపు పన్ను కార్యాలయంగా కొనసాగుతోంది. 1947 తర్వాత నిర్మాణం జరిగిన ఆయుకార్ భవన్‌కు ప్రస్తుతం ఆయుష్షు తీరింది. ఈ భవనం శిథిలావస్థకు చేరడంతో ఆదాయపు పన్ను శాఖ కార్యాలయాన్ని తాత్కాలికంగా హనుమకొండలోని ఓ ప్రైవేటు భవనంలోకి మార్చారు.

భవన్ పక్కనే ఉన్న వరంగల్ బస్టాండ్‌ను తొలగించి నూతన బస్టాండ్ నిర్మాణం కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శిథిలావస్థకు చేరిన ఆయుకార్ భవన్‌ను కూడా తొలగించి నూతన కట్టడాన్ని నిర్మించడానికి అన్ని ప్రతిపాదనలు సిద్ధం చేసి ఢిల్లీ కేంద్ర కార్యాలయానికి పంపించినట్లు జిల్లా అధికారి చక్రధర్ తెలిపారు. అనుమతులు రాగానే త్వరలో భవన నిర్మాణ పనులు కొనసాగుతాయన్నారు.

బీఫాం అందుకున్న ఎంసీపీఐ(యూ)అభ్యర్థి సావిత్రి

గిర్మాజీపేట,ఏప్రిల్ 20 : వరంగల్ ఎంపీ బరిలో నిలిచిన ఎంసీపీఐ(యు) పార్టీ మాస్ సావిత్రికి శనివారం ఆ పార్టీ బీఫామ్ అందచేసింది. అండర్‌బ్రిడ్జి సమీపంలోని పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యాలయం ఓంకార్ భవన్‌లో పార్టి రాష్ట్ర కమిటీ సభ్యుడు రవిందర్ అధ్యక్షతన ఉమ్మడి వరంగల్ జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి పార్టీ బీఫామ్‌ను సావిత్రికి అందచేశారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వల్లేపు ఉపేందర్ రెడ్డి, నాయకులు గోనే కుమారస్వామి, పెద్దారపు రమేష్, మంద రవి, బాబురావు, వెంకన్న, నగేష్, మల్లికార్జున్, ప్రేమలత, ఐలయ్య పాల్గొన్నారు.

సీఎం సభా స్థలాన్ని పరిశీలించిన కడియం

మడికొండ, ఏప్రిల్ 20: మడికొండలో ఈనెల 24న జరుగనున్న భారీ బహిరంగ సభ స్థలాన్ని శనివారం స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరిశీలించారు. ముఖ్యమంత్రి హాజరు కానున్న నేపథ్యంలో సభ ఏర్పాట్లపై చర్చించారు. ఏర్పాట్లలో ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా, సభకు వచ్చే ప్రజలకు ఏ విధమైన ఇబ్బందులు కలుగకుండా చూడాలని నేతలకు సూచించారు. ప్రజలు భారీగా తరలి వచ్చి బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు.

'కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలి'

గీసుగొండ, ఏప్రిల్ 20: వరంగల్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ నాయకుడు రడం భరత్‌కుమార్ అన్నారు. శనివారం కొమ్మాలలో ఏర్పాటు చేసిన వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షుల సమావేశంలో మాట్లాడారు. కావ్యను గెలిపించి రాహుల్‌గాంధీకి గిఫ్టుగా అందించాలన్నారు. కార్యక్రమంలో కొమ్మాల, విశ్వనాథపురం, హర్యాతండా, సూర్యాతండా, దస్రుతండా, నందనాయక్‌తండా బోగి శ్రీను, మాలోతు భద్రు, ఆంగోతు తిరుపతి, లావుడ్యా రాజన్న, బాదావత్ రమేష్, భూక్యా రమేష్, నాయకులు నవీన్, సీతారాం, సంపత్, బాలు, రాజు, గణేష్, వెంకన్న, సుమన్, శ్రీను, నరేష్, వీరన్న పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భరత్‌కుమార్

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి: డీసీపీ

మట్టెవాడ, ఏప్రిల్ 20: అగ్ని ప్రమాదాలపై అగ్నిమాపక సిబ్బంది, ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని, ఫైర్ సిబ్బంది సేవలు మరువలేనివని వరంగల్ డీసీపీ అబ్దుల్ బారి అన్నారు. శనివారం మట్టెవాడలోని జిల్లా అగ్ని మాపక కేంద్రంలో అగ్ని మాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి డీసీపీ మాట్లాడుతూ ముందు చూపుతోనే అగ్ని ప్రమాదాల నివారణ సాధ్యమన్నారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు 101 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా ఫైర్ అధికారి భగవాన్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్, డీఎంహెచ్‌వో డాక్టర్ కె. వెంకటరమణ, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు, కార్పొరేషన్ డీఎఫ్‌వో శంకర్‌లింగం, మట్టెవాడ సీఐ గోపి, అగ్ని మాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ అబ్దుల్ బారి

కాంగ్రెస్‌పార్టీలో చేరికలు



పార్టీలో చేరిన వారికి కండువాలను కప్పి ఆహ్వానిస్తున్న రేవూరి

గీసుగొండ, ఏప్రిల్ 20: ధర్మారంలో బీఆర్ఎస్ నాయకుడు గోదాసి చిన్న ఆధ్వర్యంలో 300మంది ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి ధర్మారం గ్రామపంచాయతీ వద్ద ఎమ్మెల్యే శనివారం కండువాలను కప్పి ఆహ్వానించారు. అంతకు ముందు భారీ బైక్ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో వరంగల్ పార్లమెంటు అభ్యర్థి కడియం కావ్య, రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ గాదె దయాకర్, బైకని శివ పవన్, ముద్దసాని ఇందిర, బొద్దిరెడ్డి తిరుపతిరెడ్డి, బొల్లం విద్యాసాగర్, కొండేటి కొమురారెడ్డి, గోదాసి సూరయ్య, దూపాకి సంతోష్, ముసుకు కోటిరెడ్డి, పోలెబోయిన భరత్, వంశీ, రాజ్‌యాదవ్, శ్రీను, క్రాంతి, శ్రీధర్, సంజయ్, రాజ్‌కుమార్, పిట్టల అనిల్ పాల్గొన్నారు.

భద్రకాళిని దర్శించుకున్న కేంద్ర ఎన్నికల వ్యయ పరిశీలకుడు

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 20: : ప్రసిద్ధిగాంచిన భద్రకాళి అమ్మవారిని కేంద్ర ఎన్నికల వ్యయ పరిశీలకులు ధీరజ్ సింఘా దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఆలయానికి చేరుకున్న ఎన్నికల పరిశీలకులు ధీరజ్ సింఘాకు ఆలయ అర్చకులు సంప్రదాయాలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. పరిశీలకులు అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించిన అనంతరం ఆయనకు అర్చకులు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. హైదరాబాద్‌కు చెందిన రాకాజి గురుపు శనివారం అమ్మవారిని దర్శించుకున్నారు. వీరితోపాటు శ్రీశైలంకు చెందిన కాళభైరవనాథ్‌జీ అనే స్వామిజీ కూడా అమ్మవారిని దర్శించుకున్నారు.



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న కేంద్ర ఎన్నికల పరిశీలకుడు ధీరజ్‌సింఘా

'తరగతులు నిర్వహిస్తున్న కళాశాలపై చర్యలు తీసుకోవాలి'

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 20: ఇంటర్మీడియెట్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న చింతగట్టు సమీపంలోని ఓ ప్రయివేటు జూనియర్ కళాశాల అనుమతిని రద్దు చేయాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం హనుమకొండలోని డీఐఈవో కార్యాలయంలో డీఐఈవో ఎ.గోపాల్‌ను కలిసి కళాశాలపై ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలున్నప్పటికీ నిబంధనలను తుంగలో తొక్కి కళాశాలను నిర్వహిస్తున్న కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వారు డీఐఈవో గోపాల్‌ను కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్‌బీ, టీఎస్ఎఫ్, బీఆర్ఎస్వీ, బీఎస్ఎఫ్, ఏఐఎఫ్‌డీఎస్, ఏబీఎస్ఎఫ్, గిరిజన శక్తి, ఎంఎస్ఎఫ్ నుంచి హకీం నవీద్, కన్నం సునిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికా బద్ధంగా పారిశుధ్య పనులు నిర్వహించండి

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 20: వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 66 డివిజన్‌లలో ప్రణాళికా బద్ధంగా పారిశుధ్య పనులు నిర్వహించాలని నగర పాలక సంస్థ కమిషర్ అశ్విని తానాజీ వాకడే శానిటేషన్ అధికారులకు, సిబ్బందికి సూచించారు. శనివారం మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు.ఎస్ఐలకు తమకు కేటాయించిన డివిజన్‌లు ఎన్ని కిలోమీటర్ల పొడవు ఉన్నాయి? రోడ్లు, డ్రైనేజీ కాల్వలు ఎన్ని ఉన్నాయి అనేది పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. డ్రైనేజీలు శుభ్రం చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక ఉండాలన్నారు.

పని పూర్తి కాగానే ప్రతీ రోజు స్థానికుల సంతకాలు తీసుకుని ప్రత్యేక రిజిస్టర్ మెయింటెన్ చేయాలన్నారు. శానిటేషన్ అధికారుల తీరుపై డిప్యూటీ కమిషనర్‌లు, శానిటేషన్ ప్రధాన అధికారి పర్యవేక్షణ ఉండాలన్నారు. వారంలో రెండు సార్లు ప్రజా మరుగుదొడ్లను పర్యవేక్షించి శుభ్రం చేయించాలన్నారు. సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. అదే విధంగా మలేరియా సిబ్బంది ఏయే ప్రాంతాల్లో ఫాగింగ్ చేస్తున్నారో పుస్తకంలో రాయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, వెటర్నరీ అధికారి డాక్టర్ గోపాల్‌రావు, శానిటరీ సూపర్‌వైజర్ మాదాసి సాంబయ్య, నరేందర్‌లతో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేషనల్ హ్యూమన్‌రైట్స్ జిల్లా పీఆర్వోగా మహేష్

వరంగల్‌సిటీ, ఏప్రిల్ 20: నగరంలోని 14వ డివిజన్ ఏనుమాముల ఎన్టీఆర్ నగర్‌కు చెందిన అడుప మహేష్ నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ జస్టీస్ మూమెంట్ వరంగల్ జిల్లా పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్(పీఆర్వో)గా నియమితులయ్యారు. ఈమేరకు శనివారం హ్యూమన్ రైట్స్ రాష్ట్ర చైర్మన్ సయ్యద్ షబ్బీర్ అలీ ఆదేశాలనుసారం వరంగల్ జిల్లా అధ్యక్షుడు షేక్ ఉస్మాన్ అలీ ఉత్తర్వులను జారీ చేశారు.



మహేష్

'ఎర్లీ చైల్డ్‌కేర్ ఎడ్యుకేషన్ పిల్లలకి ఉపయోగం'

కరీమాబాద్, ఏప్రిల్ 20 : ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్ పిల్లలకు ఎంతగానో ఉపయోగపడుతుందని జిల్లా సీడీపీఓ విశ్వజ అన్నారు. శాకరాసి కుంట ప్రాంతంలోని ఏకశిల పరపతి సంఘ భవనంలో శనివారం ఎర్లీ చైల్డ్ ఎడ్యుకేషన్ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. లక్ష్మీనగర్ సెక్టార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి విశ్వజ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రైవేటుకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ ఎడ్యుకేషన్‌ను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అనంత లక్ష్మీనగర్ సెక్టార్ సూపర్‌వైజర్ రమాదేవి, శివనగర్ సెక్టార్ సూపర్‌వైజర్ సుజన పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న సీడీపీవో విశ్వజ



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL ఆదివారం 21 ఏప్రిల్ 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

ఉరుములు, మెరుపులు.. .రైతుల ఉరుకులు పరుగులు



ధాన్యంపై పరదాలు కప్పుతున్న రైతు దంపతులు

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 20 : పట్టణ కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం చిరు జల్లులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో పాటు ఉరుములు, మెరుపులు రావడంతో రైతులు భయాందోళనకు గురయ్యారు. హుటాహుటీన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వెళ్లి పరదాలు, తార్పాలిన్లు ధాన్యం రాశులపై కప్పి గాలివాన వస్తే పరదాలు ఎగరకుండా రాళ్లు ఏర్పాటు చేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వాతావరణం చల్లబడి ఉండడంతో కేంద్రాల వద్దే రైతులు పడిగాపులు కాశారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



ఇల్లందలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 20 : వాతావరణంలో కలిగిన మార్పుల వలన వర్షం కురిసే అవకాశం ఉండడంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని వరంగల్ అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి సూచించారు. శనివారం మండలంలోని ఇల్లంద, ల్యాబర్తి, బొక్కలగూడెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను, ఇల్లందలోని లక్ష్మీగణపతి, శ్రీమాత, వీరభద్ర రైస్ మిల్లులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షం కురిసే సూచనలు కనిపిస్తుండడంతో అన్నదాతలు వారి ధాన్యం పై తార్పాలిన్లు, పరదాలు కప్పుకోవాలని సూచించారు. రైతుల నుంచి భారీ స్థాయిలో ధాన్యం రావడం వలన అధికారులు అవసరమైన పరదాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రైస్ మిల్లుల్లోకి వస్తున్న కేంద్రాల ధాన్యం బస్తాలను మిల్లు యజమానులు త్వరితగతిన అన్‌లోడ్ చేసి పంపించాలని సూచించారు. మార్కెట్ యార్డులో కాంటాలు పూర్తి చేసుకుని ఉన్న ధాన్యం బస్తాలు మిల్లులకు పంపించాలని, కాంటాలు సైతం త్వరగా వేసి రైతులకు సహకరించాలని కూలీను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎం సంధ్యారాణి, మార్కెట్ అధికారులు, ఐకేపీ సెంటర్ల నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

అభ్యర్థుల ఖర్చులు పక్కాగా నమోదు చేయాలి



డీసీ తండా వద్ద ఉన్న చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఎన్నికల వ్యయ పరిశీలకుడు

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 20 : వరంగల్ పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఖర్చులు పక్కాగా నమోదు చేయాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు ధీరజ్ సింఘా సూచించారు. శనివారం పట్టణంలోని వర్ధన్నపేట అసెంబ్లీ సెగ్మెంట్ ఏఆర్‌వో కార్యాలయాన్ని సందర్శించారు. అంతకు ముందు డీసీ తండా వద్ద ఏర్పాటు చేసిన స్టాటస్టిక్ సర్వేలైన్స్ టీం చెక్ పోస్టును తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఎన్నికల వ్యయ నమోదు, అకౌంటింగ్ టీంలు, వారి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనలు ఖచ్చితంగా పాటిస్తూ వరంగల్ ఎంపీ స్థానానికి పోటీ చేస్తున్న రాజకీయ అభ్యర్థుల ఖర్చుల లెక్కలు పక్కాగా ఉండాలన్నారు. అకౌంటింగ్ టీం, వీఎస్‌టీ, వీవీటీలు అసెంబ్లీ సెగ్మెంట్లలో కచ్చితంగా నమోదు చేయాలని, అభ్యర్థులు నిర్వహించే ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు, రోడ్ షోలు అన్నింటిని వీడియో సర్వేలైన్స్ టీం సభ్యులు రికార్డు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సిదం దత్తు, ఏఈవో నాగనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

కంఠమహేశ్వరస్వామి ఆలయంలో హోమం



హోమంలో పాల్గొన్న భక్తులు

పర్వతగిరి, ఏప్రిల్ 20 : మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన కంఠమహేశ్వర స్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాల సందర్భంగా శనివారం హోమం కార్యక్రమాన్ని నిర్వహించారు. హోమంలో గౌడ కులస్తుల భార్యాభర్తలు కలిసి కూర్చుని గౌరీపూజ, హోమం నిర్వహించారు. ఆదివారం ఉదయం కంఠమహేశ్వరస్వామి, సురమాంబ, వనం ఎల్లమ్మ, వనం మైసమ్మల విగ్రహాల ప్రతిష్ఠాపన, సాయంత్రం జలబిందెలతో ఊరేగింపు, అభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు తీగల వీరస్వామిగౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు పుల్లూరి సారయ్యగౌడ్, గౌరవ అధ్యక్షులు రంగు జనార్ధన్‌గౌడ్, రంగు కుమార్‌గౌడ్, ఉపాధ్యక్షులు దయాకర్‌గౌడ్, శ్రవణ్‌గౌడ్, సభ్యులు మడ్డి వెంకన్న, చిర్ర శేఖర్, రంజిత్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక సిబ్బంది సేవలు మరువలేనివి

• వర్ధన్నపేట ఏడీఏ సురేష్ కుమార్

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 20 : అగ్ని ప్రమాదాల నుంచి ప్రజల ప్రాణాలను, వారి ఆస్తులను కాపాడే అగ్నిమాపక సిబ్బంది సేవలు మరువలేనివని వర్ధన్నపేట ఏడీఏ సురేష్ కుమార్ స్పష్టం చేశారు. శనివారం పట్టణంలోని ఫైర్ స్టేషన్ ఆవరణలో ఫైర్ ఆఫీసర్ భద్రయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వివిధ ప్రమాదాల కారణంగా సంభవించే అగ్ని ప్రమాదాల బారి నుంచి ఎంతో ప్రాణాలకు తెగించి ప్రజలను, వారి ఆస్తులను సురక్షితంగా కాపాడే వారికి అండగా నిలవాలన్నారు. బాధితులను రక్షించే సమయంలో వారి ప్రాణాలు కోల్పోయిన వారిని గుర్తు చేసుకుని నిర్వహించే ఈ వారోత్సవాలు విజయవంతంగా ముగియడం సంతోషంగా ఉందన్నారు. వారోత్సవాల్లో భాగంగా వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో, వాణిజ్య వ్యాపార సముదాయాల్లో, ఆస్పత్రుల్లో అన్ని చోట్ల అవగాహన కల్పించి మనకు తోడున్నామని ధైర్యం కల్పించిన ఫైర్ సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్, ఐసీడీఎస్ అసిస్టెంట్ ప్రభాకర్, ఎంపీడీవో, సీడీపీవో కార్యాలయ సిబ్బంది, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

కాకతీయుల దేవాలయాలపై పట్టింపేదీ?

చోరీకి గురైన దేవతల విగ్రహాలు, ఆభరణాలు

నామమాత్రంగా పూజలు

అన్యాక్రాంతమైన వరదరాజు ఆలయ స్థలం

వర్షం వస్తే కురుస్తున్న శివాలయం

నెక్కొండ , ఏప్రిల్ 20 : వరంగల్ జిల్లా నెక్కొండ మండలం దీక్షకుంట గ్రామంలో దాదాపు 600 వందల సంవత్సరాల క్రితం కాకతీయులు నిర్మించిన దేవాలయాలు ఆలనాపాలన కరువై, దేవాదాయ శాఖ పట్టింపులేక కాలగర్భంలో కలసిపోతున్నాయి. ఈ గ్రామంలో శివాలయం, వరదరాజేశ్వరస్వామి ఆలయాలను కాకతీయుల కాలంలో నిర్మించారు. గ్రామీణ ప్రాంత ప్రజల్లో భక్తి భావాలను పెంపొందించేందుకు కాకతీయుల పాలన సమయంలో గ్రామాల్లో దేవాలయాల నిర్మాణానికి పూనుకున్నారు. దీక్షకుంట గ్రామంలో నిర్మించిన దేవాలయాల బాగోగులను చూడడంతో పాటు నిత్య పూజలు



అన్యాక్రాంతమవుతున్న శివాలయ భూమి

జరిపించుటకు దేవాలయం మాన్యం పేరుతో ఈ దేవాలయాలకు రెండు ఎకరాల చొప్పున సాగుభూమిని కేటాయించారు. అయితే ప్రస్తుతం ఈ దేవాలయాల మాన్యం భూములు కనిపించడం లేదు. అలాగే వరదరాజేశ్వర స్వామి దేవాలయంలోని విగ్రహాలు సైతం గత 25 సంవత్సరాల క్రితం దొంగల పాలయ్యాయి. శివాలయంలోని లింగం, నందులు, మకరతోరణం, గరుడ వాహనం, సర్ప విగ్రహంతోపాటు గంట, హారతి పళ్లెం, శఠగోపాలను దొంగలు కాజేశారు. దీంతో శివాలయం మాత్రం మిగిలింది. ఈ ఆలయం పేరు మీద పూజారి సతీష్ కుమార్ ప్రభుత్వం నుంచి దూప, దీప, నైవేద్యం కింద గౌరవ వేతనం పొందుతున్నారు. కానీ, ఆలయంలో నిత్య పూజలను నామమాత్రంగానే జరుగుతున్నాయి.

శివలింగం పునఃప్రతిష్ఠాపన చేయాలి

కాకతీయకాలంలో నిరించిన గ్రామంలోని శివాలయంలోని శివలింగం పునఃప్రతిష్ఠాపన, ధ్వజస్తంభం, నవగ్రహ మండపం, ఆలయం చుట్టూ కాంపౌండల్ వాల్ నిర్మాణంచేయాలి. ఆలయం శిథిలావస్థకు చేరకోవడంతో వర్షకాలంలో కురుస్తుంది. దీంతో భక్తులకు తీవ్ర అసౌకర్యం కలుగుతుంది. ఆలయ అభివృద్ధికి గాను దాతలు ముందుకు రావాలని భక్తులు కోరుతున్నారు.

శిథిలావస్థలో వరదరాజేశ్వరస్వామి ఆలయం

కాకతీయ రాజులు ఎంతో భక్తితో నిర్మాణంచేసిన వరదరాజేశ్వరస్వామి గుడి శిథిలావస్థకు చేరుకుని నిరుపయోగంగా మారింది. విగ్రహాలు దొంగలపాలు కాగా, సంబంధితాధికారులుగానీ,పాలకులుగానీ గుడిలో ఎలాంటి విగ్రహాలను నేటికి ఏర్పాటుచేయలేదు. గుడికి ఆనుకుని ఉన్న కోనేరు స్థలం ఏడు గుంటలు గ్రామ ప్రముఖులు ఐదు సంవత్సరాల క్రితం గ్రామంలోని ఓ వ్యక్తికి విక్రయించగా కోనేరు స్థలంలో భవనం వేలసింది. గుడి చుట్టూ చిన్ని చిన్న కిల్లీ కొట్లను, మంగళి షాపులను ఏర్పాటు చేశారు. దేవాదయ శాఖ అధికారులు పట్టించుకోని ఈ ఆలయంలో భక్తులు శివరాత్రి, ఇతర పండుగల రోజు పూజలను జరుపుతున్నారు.



నామమాత్రం పూజలకు నోచుకుంటున్న శివాలయం



విగ్రహాలులేని వరదరాజేశ్వరస్వామి ఆలయం

ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలి

మేర్గు అయిలుమల్లు, భక్తుడు



పూరావస్తు శాఖాధికారులు స్పందించి దీక్షకుంట గ్రామంలోని కాకతీయ దేవాలయాల అభివృద్ధికి నిధులను కేటాయించాలి. గ్రామాలోని ప్రజల్లో భక్తి భావాలను పెంపొందించుటకు నూతనంగా దేవాలయాల నిర్మాణాలను చేస్తుంది. కానీ, దీక్షకుంట గ్రామంలో కాతీయుల కాలంలో నిర్మాణం చేసిన దేవాలయాల్లో కేవలం శివాలయానికి మాత్రమే దూప, దీప, నైవేద్యం పథకం కింద ప్రతి నెలా పూజారికి గౌరవ వేతనం అందుతుంది. వరదరాజేశ్వరస్వామి దేవాలయాన్ని కూడా ఈ పథకంకు ఎంపికచేయాలి. దీంతో నిత్య పూజలు అందుతాయి. అలాగే ఈ రెండు దేవాలయాల చుట్టూ కాంపౌండ్ గొడ నిర్మాణం చేయాలి. లేదంటే గుడి చుట్టూ ఉన్న స్థలం అన్యాక్రాంతమవుతుంది.

ఆలయాభివృద్ధి కమిటీ ఏర్పాటు చేయాలి

బూర్గుపల్లి సతీష్, పూజారి



ఆలయ అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేయడానికి గ్రామ పాలకులు ముందుకు రావాలి. ప్రభుత్వం నుంచి అందుతున్న గౌరవ వేతనం ఆరు వేలు కాగా, ఇందులో రెండు వేలు దీప, దూప, నైవేద్యాలకు ఖర్చుచేయాల్సి ఉంది. కానీ, ఆరు వేల రూపాయలు కూడా ఖర్చు చేసినా సరిపోవడం లేదు. దేవాలయానికి భక్తులు వచ్చినా వారి నుంచి కానుకలు నామమాత్రంగా వస్తుంటాయి. దీంతో శివరాత్రి లాంటి వేడుకల నిర్వహణ భారమవుతుంది. ఈ దేవాలయాల అభివృద్ధికి పాలకులు, దాతలు ముందుకు రావాలి .

వరికి మద్దతు ధరతోపాటు బోనస్ చెల్లించాలి

• మాజీ ఎమ్మెల్యే పెద్ది, మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి కవిత

ఖానాపురం, ఏప్రిల్ 20 : రైతులు పండించిన వరి ధాన్యానికి మద్దతు ధరతో పాటు, క్వింటాకు రూ. 500చొప్పున ఎకరాకు రూ.15వేల బోనస్ చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత అన్నారు. కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల సందర్భంగా రైతులకు హామీఇచ్చిన విధంగా బోనస్ రూ.500 ఇచ్చి ధాన్యం కొనుగోళ్లు జరపాలని డిమాండ్‌చేశారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాలోతు కవిత గెలుపునకు మద్దతుగా మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తల సన్నాహక సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ నాలుగు నెలల కాంగ్రెస్ పాలనలో నర్సంపేట నియోజకవర్గంలో చేసింది ఏమిలేదని, భవిష్యత్‌లో కూడా ఏమిచేయలేరని అన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడూ తెచ్చిన జీవోల్లో (అభివృద్ధి పనులు)ఏ ఒక్కటి ల్యాప్స్ అయినా ఒదిలి పెట్టేది లేదన్నారు. తాను తెచ్చినవి దొంగ జీవోలు అయితే ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. రాష్ట్రం అంతట పంటలు ఎండుతుంటే పాకాల ఆయకట్టులో రామప్ప-పాకాల ప్రాజెక్ట్‌తో యాసంగి పంటకు సరిపడా సాగునీరంది రైతులు సుభిక్షంగా ఉన్నారన్నారు. ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటానని అన్నారు. కవితను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

• నిజమైన అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యం..

బీఆర్ఎస్‌తోనే నిజమైన అభివృద్ధి జరుగుతుందని ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత అన్నారు. మార్పును కోరి కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఓట్లు వేస్తే నట్టేట ముంచారన్నారు. అమలు కాని వాగ్దానాలతో ప్రజలను మోసంచేసి అధికారంలో వచ్చిన కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి తనను అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామి నాయక్, ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, వైస్‌ఎంపీపీ రామసహాయం ఉమా ఉపేందర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటనర్సయ్య, రవీందర్‌రెడ్డి, బాబురావు, మండల కో ఆప్షన్ సభ్యుడు మస్తాన్, కుందనపల్లి శైలజ, ఎంపీటీలు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.



ఖానాపురంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

• బీఆర్ఎస్ సైన్యం గెలిపిస్తారనే విశ్వాసం బలంగా ఉంది : కవిత

నల్లబెల్లి : మే 13న జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సైన్యం తనను గెలిపిస్తారనే విశ్వాసం బలంగా ఉందని మహబూబాబాద్ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి మాలోతు కవిత అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సుమంగళి ఫంక్షన్ హాల్లో బీఆర్ఎస్ సైన్యం సభ జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన కవిత మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు నేటికి అమలుకాలేదని విమర్శించారు. సాధ్యంకానీ హామీలను ఇచ్చి ప్రజలను మభ్యపెట్టారన్నారు. ప్రజల్లో కూడా ఇప్పటికే వ్యతిరేకత పెరిగిందన్నారు. సమావేశంలో నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, నాయకులు పెద్ది స్వప్న, బానోతు సారంగపాణి, మురళీధర్, ప్రవీణ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీలతాశ్రీనివాస్ గుప్తా, శ్రీదేవి పాల్గొన్నారు.

• మాలోతు కవితను గెలిపించాలి : పెద్ది

దుగ్గొండి : మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా రెండోసారి బీఆర్ఎస్ అభ్యర్థి మాలోతు కవితను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పిలుపు నిచ్చారు. మండలంలోని గిర్నిబావిలో మండలస్థాయి కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించగా అభ్యర్థి మాలోతు కవిత పాల్గొనగా, పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. మండలంలోని అభివృద్ధి పనులు చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి కవిత, మండల పార్టీ అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు, జడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ఎంపీపీ కాట్ల కోమలభద్రయ్య, బండి జగన్నాధం, ప్రశాంత్, రాజు, సోనీ రతన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

నర్సంపేట, ఏప్రిల్ 20 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ పార్ల మెంట్ బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్‌ను గెలిపించాలనే లక్ష్యంతో పనిచేయాలని బీజేపీ పట్టణ నాయకులు ఠాకూర్ ప్రతిక్షసింగ్, కుసుమ భవాని శంకర్‌లు కోరారు. పట్టణంలోని 161, 157బూతుల్లో శనివారం బీజేపీ పట్టణ నాయకులు కేంద్ర ప్రభుత్వ పథకాలను లబ్ధిపొందిన లబ్ధిదారులను కలిసి కరపత్రా లను అందజేశారు. ప్రధానిగా మళ్ళీ ప్రధాని మోడీనీ, ఎంపిగా సీతారాంనాయక్‌ను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బీజేపపి పట్టణ ప్రధాన కార్యదర్శులు కొంపెల్లి రాజు, గూడూరు సందీప్, కూనమల్ల పృధ్వీరాజ్, ఠాకూర్ రవీందర్‌సింగ్, ఠాకూర్ శివాంజన్‌సింగ్, వల్లాజి నసరేందర్, సతీష్, సత్యం, చిలువేరు అన్వేష్ పాల్గొన్నారు.



నర్సంపేటలో కరపత్రాలను పంపిణీచేస్తున్న బీజేపీ నాయకులు

• బీజేపీ ఇంటింటి ప్రచారం

రాయపర్తి : వరంగల్ ఎంపీ బీజేపీ అభ్యర్థి అరూరిరమేష్ గెలుపే లక్ష్యంగా శనివారం బీజేపీ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండల కేంద్రంలో మండల ఎన్నికల కన్వీనర్ నూనె అనిల్, బీజేపీ యువ మోర్చా పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ ఎనగందుల శ్రావణ్ ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెండ్యాల గణేష్, మంచాల సుమన్, బండారి దినేష్, అశోక్, నరేష్, వెంకటేశ్, రాకేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

• బీజేపీలో చేరిన నాయీ బ్రహ్మణులు

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 20: పట్టణానికి చెందిన పలువురు నాయీ బ్రహ్మణులు రాష్ట్ర ఎస్సీ సెల్ బీజేపీ అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. శుక్రవారం సాయంత్రం ఐనవోలులో జరిగిన పలు కార్యక్రమంలో పాల్గొనగా, వరంగల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్, బీజేపీ హన్మకొండ జిల్లా అధ్యక్షు రాలు రావు పద్మ, రాష్ట్ర నాయకుడు ఎర్ర బెల్లి ప్రదీప్‌రావులు నాయీ బ్రహ్మణులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీని నమ్ముకుని వస్తున్న వారికి ఎల్లవేళలా అండగా ఉంటామని స్పష్టం చేశారు. కొత్త, పాత తేడా లేకుండా ప్రతి ఒక్కరూ బీజేపీ గెలుపు కోసం పనిచేయాలని సూచించారు. బీజేపీలో చేరిన వారిలో జంబారపు శ్రీనివాస్, గొల్లపెల్లి శ్రీనివాస్, కేదారి, సతీష్, శ్యాంలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దూరి రాజ్ కుమార్, కొండేటి సత్యం, గుడ్ల సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో సీట్లు పొందిన విద్యార్థులు



గురుకులంలో సీట్లు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

దుగ్గొండి, ఏప్రిల్ 20 : మండలంలోని తొగర్రాయి పాఠశాలలోని 9 మంది విద్యార్థులు గురుకులంలో సీట్లు సాధించిన సందర్భంగా ఉపాధ్యాయులు శనివారం అభినందనలు తెలిపారు. ప్రవేశాలు పొందిన విద్యార్థులు సహస్ర, ప్రమిత, సాత్విక, మానస్విత, వాగ్దేవి, రూపశ్రీ, నిఖిత, సంజన, వరుణ్‌లను మాజీసర్పంచ్ తిరుపతిరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మల్లయ్య, ఉపాధ్యాయులు పద్మశ్రీ, వీరస్వామి, రమాదేవి, నీరజ, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్‌కు మోక్షం ఎప్పుడో..?

నల్లబెల్లి, ఏప్రిల్ 20 :మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుతం ఆధార్ సెంటర్‌కు అనుమతులు వచ్చినప్పటికీ ప్రారంభించకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మార్చి నెలలోనే ఆధార్ సెంటర్ ఆపరేటర్‌గా అడ్డగట్ల రాజును నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోనే ఆధార్ సెంటర్‌ను కొనసాగించవచ్చుని తెలిపారు. గతంలో ఆధార్ సెంటర్ తహసీల్దార్ కార్యాలయఆవరణలోనే కొనసాగింది. ప్రస్తుతం కూడా కార్యాలయ ఆవరణలోని బిల్డింగ్‌లోనే ఆధార్ సెంటర్ ప్రారంభిస్తానని ఆపరేటర్ రాజు అంటున్నారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో స్థలంలేదు, జీపీ కార్యాలయ ఆవరణలో ఆధార్ సెంటర్‌ను ప్రారంభించుకోవాలని తహసీల్దార్ రాజేష్ అంటున్నారు. ఇరువురి మధ్యన వైరంతో అనుమతి వచ్చిన ఆధార్ సెంటర్ నేటికీ ప్రారంభం కాకపోవడంతో మండల ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో ఆధార్ సెంటర్ ఎప్పుడు ప్రారంభమవుతుందోనని మండల ప్రజల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మూలమలుపుల వద్ద ధాన్యం కల్లాలు...



వరంగల్ ప్రధాన రహదారి మూల మలుపుల వద్ద ధాన్యం, మొక్కజొన్న కల్లాలు

నెక్కొండ, ఏప్రిల్ 20 : నెక్కొండ-వరంగల్ ప్రధాన రహదారిలోని రోడ్ల మూల మలుపుల వద్ద రోడ్లను సగానికి పైగా అక్రమించి వరి, మొక్కజొన్న కల్లాలను రైతులు విచ్చలవిడిగా ఏర్పాటు చేస్తుండటంతో వాహనదారులకు ప్రాణ సంకటంగా మారుతున్నాయి. వాహనదారుల ప్రమాదాలను నివారించేందుకు మూల మలుపుల వద్ద ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్లను వెడల్పుగా (విశాలంగా) నిర్మాణం చేస్తుంటారు. ఇదే అదునుగా భావించిన రైతులు ఈ ప్రాంతాల్లో కల్లాలను ఏర్పాటు చేస్తున్నారు. పూర్వం వాహనదారులు ప్రమాదాలకు గురవుతారన్న ఉద్దేశ్యంతో వ్యవసాయ సాగు భూముల్లోనే రైతులు కల్లాలను ఏర్పాటు చేస్తుకునేవారు. నేటి అధునిక రైతులు ఇష్టారాజ్యంగా ఎవరికి ఏమైతే తమకేమిటంటూ ఎడాపేడా రోడ్లపై కల్లాను ఏర్పాటు చేయడమే కాకుండా పంటల రాశులకు అడ్డంగా ముళ్ల పొదలను, బండరాళ్లను అడ్డంగా పెడుతున్నారు. రాత్రి సమయంలో బారీ వాహనాల లైట్ల కాంతులకు రోడ్డు పైన పోసిన ధాన్యం ఏర్పడక ప్రమాదాలకు గురై ప్రాణాలను సైతం కోల్పోతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. నిత్యం రోడ్ల వెంట ఉంటూ ప్రమాదాల నివారణకు అంటూ వాహనదారులకు రకరకాలుగా చాలాన్లు వేస్తున్న పోలీసు అధికారులకు ప్రమాదాలకు కారణమవుతున్న ఈ కల్లాలు కనిపించడం లేదా అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవాలి

చెన్నారావుపేట, ఏప్రిల్ 20 : ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించుకోవాలి ఏపీఎం ముక్కెర ఈశ్వర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఆశాజ్యోతి మండల సమైఖ్య వారి ఆధ్వర్యంలో పీడీడీఆర్‌డీఓ కౌసల్యా దేవి పిలుపు మేరకు మహిళ సంఘాలతో ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం రాబోయే రోజుల్లో క్యాన్సర్‌కు దారి తీస్తుందన్నారు. ప్లాస్టిక్ నివారణలో మహిళలందరూ భాగస్వాములు కావాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీసీ కట్టయ్య, శ్రీలత, సుజాత, హంస స్వప్న, అనిత, శిరీషా, రమ, కోమల, జ్యోతి పాల్గొన్నారు.

తాటి వనాలకు మొగిపురుగు దెబ్బ

ఎండిపోతున్న తాటి చెట్లు

తాటికమ్మలు రాలి మోడుల్లా మారుతున్న తాటి చెట్లు

ఉపాధిని కోల్పోతున్న గీత కార్మికులు

పాలకులు మారినా.. మారని గీత కార్మికుల తలరాతలు

నర్సంపేట, ఏప్రిల్ 20 : తాటి చెట్లే గీత కార్మికులకు జీవనాధారం... ఆకాశం ఎత్తైన తాటి చెట్లకు వచ్చే కల్లు విక్రయంతో గీత కార్మికులు కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఎత్తయిన తాటి చెట్లు ఎక్కి కల్లు తీయడం ప్రమాదకరమని తెలిసినా.. తాటిచెట్లు ఎక్కేందుకు వెళ్లిన గీత కార్మికుడు క్షేమంగా ఇంటికి తిరిగివస్తాడా అన్న భయం కుటుంబ సభ్యుల్లో ఉన్నా తాటి చెట్లు ఎక్కి కల్లు తీస్తూ జీవనం సాగిస్తున్నారు. పాలకులు మారినా వృత్తిని నమ్ముకున్న గీత కార్మికుల తలరాతలు మారడం లేదు. నాలుగు నెలల పాటు తాటి చెట్లకు వచ్చే కల్లును అమ్ముకొని, వచ్చే ఆదాయంలో ఏడాది పొడవునా జీవనం కొనసాగించాల్సిన దుస్థితులను గీత కార్మికులు ఎదుర్కొంటున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం వల్ల పొలాల గట్లపై ఉన్న తాటిచెట్లు నరికివేతకు గురవుతుండడంతో పాటు తాటిచెట్లకు మొగిపురుగు సోకి తాటి చెట్లు అంతరించిపోతుండడం వల్ల గీత వృత్తిన్ని నమ్ముకొని జీవనం సాగిస్తున్న గీత కార్మికులకు ఉపాధి కరువై దుర్భర జీవితాలను గడుపుతున్నారు. వ్యవసాయ భూములను రియల్ ఎస్టేట్ వెంచర్లుగా వాడుకోవడం వల్ల తాటి వనాలు కనుమరుగై పోతుండగా మొగి పురుగుతో గీత కార్మికుల ఉపాధికి మరో దెబ్బ తగులుతుంది. కుండల కొద్ది కల్లు వచ్చే తాటి చెట్లు మొగివిరిగి (తాటాకులులేకుండా)పోవడంతో పాటు తాటి చెట్టు ఎండిపోయి మోడుల్లా మారిపోతున్నాయి. తాటి చెట్ల మొగివిరిగి పోవడంతో ఉపాధిని కోల్పోతున్నామని గీత కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరంగల్ జిల్లాలో అధిక సంఖ్యలో తాటిచెట్లు మొగి పురుగు బారినపడి చనిపోయాయి. పాలకులు మారినా గీత కార్మికుల తలరాతలు మారడం లేదని గీత కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాటి, ఈత వనాల పెంపునకు ప్రత్యేక స్థలాలను కేటాయించే విషయంలో, తాటిచెట్ల పెంపకానికి ప్రోత్సాహం అందించకపోవడంతో ఉన్నతాటి చెట్లు అంతరించి పోవడం వల్ల గీత వృత్తికి కల్లు గీత కార్మికులు దూరమై ఉపాధిలేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని గీత కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధి కోల్పోతున్న గీత కార్మికులు

జిల్లాలోని నర్సంపేట, చెన్నారావుపేట, నెక్కొండ, దుగ్గొండి, నల్లబెల్లి, ఖానాపురం, గీసుగొండ, ఖిలావరంగల్, సంగెం, వర్ధన్నపేట, పర్వతగిరి, రాయపర్తి తదితర మండలాల్లో మొగిపురుగుతో తాటిచెట్లు ఎండిపోయి కల్లుగీత కార్మికులు ఉపాధిని కోల్పోతున్నారు. జిల్లాలో సుమారు 14వేలకు పైగా ఈత చెట్లు, 50వేలకు పైగా తాటిచెట్లు ఉన్నట్లు తెలిసింది. అందులో నర్సంపేట నియోజకవర్గంలోనే అధికారుల లెక్కల ప్రకారం 6,792 ఈతచెట్లు, 21,560 తాటి చెట్లు ఉన్నాయి. మరో 10వేల నుంచి 20వేల తాటిచెట్లు అధికంగా ఉంటాయని గీత కార్మికులు పేర్కొంటున్నారు. గత కొన్నేళ్ళుగా ఈత, తాటి చెట్లు ఎన్ని ఉన్నాయో అన్న సర్వే జరుగలేదంటున్నారు. నర్సంపేట మండలంలో అధికారుల లెక్కల ప్రకారం 671 ఈత చెట్లు, 3,873 తాటిచెట్లు ఉన్నాయి, చెన్నారావుపేట మండలంలో 2,561ఈత చెట్లు, 5,609 తాటిచెట్లు, నెక్కొండ మండలంలో 883 ఈతచెట్లు, 1,042 తాటిచెట్లు ఉన్నాయి, నల్లబెల్లి మండలంలో 891 ఈత చెట్లు, 2,850 తాటిచెట్లు ఉండగా, దుగ్గొండి మండలంలో 850 ఈతచెట్లు, 1362 తాటి చెట్లు ఉన్నాయి. ఖానాపురం మండలంలో 265 ఈతచెట్లు, 2,625తాటి చెట్లు ఉన్నాయి. సుమారు మూడు నుంచి నాలుగు వేల తాటి చెట్లు మొగి పురుగుతో చనిపోయి ఉంటాయని గీత కార్మికులు చెబుతున్నారు.



మాధన్నపేట చెరువుకట్ట సమీపంలో మొగిపురుతో చనిపోయి మోడులుగా మారిన తాటి చెట్లు

ఒక చెట్టు చనిపోగానే...

మొగి పురుగు చెట్టు మొగిలో చేరి రసాన్ని పీల్చుతూ తాటి చెట్టు కిందికి తొలుచుకొంటూ వెలుతుంది. చెట్టు చనిపోగానే మరో చెట్టుకు చేరి ఆ చెట్టును రసం పీల్చడం వల్ల చెట్లు చనిపోతున్నాయి. మొగి పురుగు నివారణకు మందులు లేకపోవడం, ఈ పురుగు నివారణకు ఎక్సైజ్ శాఖాధికారులు, ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం వల్ల తాటి వనాలు, తాటి చెట్లు అంతరించిపోయి తమ ఉపాధికి గండి పడుతుందని గీతాకార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.